LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM Visit Internet Edition @ www.zaminryot.com "e-mail : editor@zaminryot.com"

జమీన్‌రైతు

D.R. UTTHAMA ★★★ HOTEL

డి.ఆర్. ఉత్తమలో
విందుల వసంతం

- వెజిటేరియన్ భోజనం Rs. 59/-
- నాన్ వెజిటేరియన్ భోజనం Rs. 74/-
- ప్రతి ఆదివారం నెల్లూరు స్పెషల్ నుడితో బఫే లంచ్ రూ. 160/- లతే (అన్ని టార్జ్‌లతో కలిపి).

Signature Club Members only avail 20% Discount.

Phones : 317777 - 10 Lines

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు సంపుటి : 73 సంచిక : 2 11.1.2002 శుక్రవారం 12 పేజీలు వెలిప్రతి : రూ.3.00లు వీరప్రధాత : నెల్లూరు శ్రీరాములయ్య

కరెంట్ కొరడా దెబ్బ తప్పేటట్లు లేదు!

ఛార్జీలు పెరిగేకొద్ది విద్యుత్ సంస్థ నష్టం పెరిగిపోవడం మన ముఖ్యమంత్రి మాత్రమే సాధించగలిగిన విచిత్రం.

నిజాలు నిగ్గు తేల్చడం ఎవరి తరం కాదు. కాని అటువంటి వాతావరణం సృష్టించినందుకు ప్రతి కాంగ్రెస్ పెద్ద కూడా సిగ్గు పడవల్సి వుంటుంది.

కరెంట్ ఛార్జీల పెంపకం చర్చ మరొక సారి ముందుకు వచ్చింది. రాష్ట్రంలో అక్కడక్కడా మునిసిపల్ ఎన్నికలు జరుగుతున్నాయి కాబట్టి ప్రభుత్వం తొందరపడి ముందుకు వెళ్లడం లేదు కాని, లేకుంటే మొన్న డిశంబర్ 31తేది నాడే తన నిర్ణయం ప్రకటించి వుండేది.

రాబోయే ఏడాదికి విద్యుత్ ఉత్పత్తి, పంపిణీలకయ్యే ఖర్చు - రాబడులు మధ్య 2874 కోట్ల రూపాయలు లోటు వుంటుందని విద్యుత్ సంస్థ అంచనా. ఇందులో 1626 కోట్ల వరకు ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుంది. మొండి బాకీల వసూలు వంటి చర్యల ద్వారా కొంత ఆదాయం పెంచుకున్నా కనీసం 750 కోట్ల రూపాయల నికరలోటు తేలుతుందని వారి లెక్క. దీన్ని పూడ్చుకోవడానికి వున్న ఏకైక మార్గం - ఛార్జీల పెంపకం మాత్రమే. సరాసరిన 8శాతం వరకు అదనంగా ఛార్జీలు వడ్డిస్తే తప్ప ఈ లోటు పూడదు.

కరెంట్ విషయంలో ఏడాదిన్నర క్రితం రాష్ట్రంలో ఎంత పెద్ద ప్రజా ఉద్యమాలు నడిచింది తెల్సిన సంగతే. జనం తిరగబడితే పోలీసులతో చావబాదించడం తప్ప ఛార్జీలు తగ్గించడం మాత్రం సాధ్యం కాదని మొండిగా నిలబడ్డాడు అప్పట్లో మన ముఖ్యమంత్రి. ఆనాడే ప్రతిపక్షాలు ఆరోపించాయి - ప్రతి ఏటా 10శాతం వరకు ఛార్జీలు పెంచుతామని ప్రపంచ బ్యాంక్‌కు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని. అయితే ఆ వాదనను ముఖ్యమంత్రి తోసిపుచ్చారు. చాలా ఏళ్ల నుంచి రేట్లు పెరగలేదు కాబట్టి పెంచడమే తప్ప, ఇందులో ప్రపంచ బ్యాంక్ ప్రమేయం ఏదీలేదని, ఈ ఒక్కసారి తప్ప సమీప భవిష్యత్తులో పెంపకం జరగదని నమ్మబలికారాయన.

అవి వట్టి మాటలని ఇప్పుడు రుజువు అవుతున్నది. గత ఏడాది కూడా ధరలు పెచ్చింపుకు ఆలోచన చేశారు. కాని అప్పట్లో పంచాయతీ ఎన్నికలు జరగవల్సి వుండింది కాబట్టి బలవంతంగా ఆ కోరిక చంపుకున్నారు. రేపు 22తేది మునిసిపల్ ఎన్నికల తర్వాత ఇక ఇప్పట్లో మరే ఎన్నికలు లేవు. రానున్న రెండున్నరేళ్ల సమయం ప్రభుత్వానికి వెసలుబాటు. అందువల్ల ఛార్జీల వడ్డనకు ఇదే మంచి తరుణమని తొందర పడుతున్నారు అధికారులు.

అయితే ఇప్పటికే మన రాష్ట్రంలో కరెంట్ తాకితే కాలిపోయేటట్లు వుంది. దేశంలో ఎక్కడా లేనంత అధిక రేట్లు అమలులో వున్నాయి. గుడిసెలలో ఒకే ఒక్క దీపం వెల్గించుకునే పేద ప్రజల నుంచి, విద్యుత్తే తమ మూడి వనరుగా వాడుకునే భారీ పరిశ్రమల వరకు ఛార్జీలు మితిమించి పోయాయి. ఇటు ప్రజలు, అటు పరిశ్రమల వారు కూడా ఎంత మాత్రం పెచ్చింపు భరించగలిగే పరిస్థితి లేదు. వీటిపైన 8శాతం పెరుగుదల అంటే కరెంట్ బల్బులు ఆర్పేసి లాంతర్లు, కాగడాలు వెల్గించుకోవడం తప్ప వేరే గత్యంతరం మిగలదు జనానికి.

విద్యుత్ సంస్థ అధికారులు మాత్రం కాకి లెక్కలు చెప్పడం మానడం లేదు. రెండేళ్ల క్రితం ఛార్జీల పెంపక సమయంలో వారు చేసిన వాదన - సంస్థకు దాదాపు 2200 కోట్ల రూపాయల నష్టం వస్తున్నదని; అంతర్గత సామర్థ్యం మెరుగుపర్చుకుని ఏటా 500 కోట్ల రూపాయల వరకు అదనంగా సంపాదిస్తామని; మిగిలిన కొద్ది తేడాకు మాత్రమే ఛార్జీలు పెంచుతామని చెప్పారు వారప్పుడు. అవి ఒట్టి గాలి మాటలని ఇప్పుడు అర్థం అవుతున్నది.

రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలు అమలు చేయడం మొదలై మూడేళ్లు గడచిన తర్వాత; దాదాపు 800 కోట్ల రూపాయల ఛార్జీల పెంపకం జరిగిన తర్వాత; దొంగ కరెంట్ వినియోగదారులపై దాడులు చేసి, జైళ్లలో క్రుక్కి, రైతాంగాన్ని రచ్చకు ఈడ్చిన తర్వాత వీరు సాధించిన ఘనత - నష్టాన్ని 2200కోట్ల నుంచి 2874 కోట్లకు పెంచడం మాత్రమే. సంస్కరణల వల్ల విద్యుత్ సంస్థ నష్టాలు, ఛార్జీలు తగ్గుతాయని కల్లబొల్లి మాటలు చెప్తున్నాడు ముఖ్యమంత్రి. అదే నిజమైతే నష్టం దాదాపు 700 కోట్లు ఎందుకు పెరిగింది.

ప్రభుత్వం విద్యుత్ చోరీపై

తొరవ 12వ పేజీలో

రోతబట్టిన కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్ నగర పాలక సంస్థ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ నేతల దౌర్భాగ్య మనస్తత్వానికి అద్దం పడుతున్నాయి. రాష్ట్రంలోని స్థానిక సంస్థలన్నింటిలోకి కీలకమైనది ఈ మునిసిపల్ కార్పొరేషన్. జన సంఖ్య ఎక్కువ కావడమే కాదు - రాజధాని నగరం కావడంతో దాదాపు రాష్ట్ర ప్రభుత్వానికి సమాంతరమైన అధికార చిహ్నం అది. అందులోనూ నగర మేయర్‌కు ముఖ్యమంత్రి కంటే అధికమైన ప్రోటోకాల్ ప్రత్యేకతలు వున్నాయి. విశిష్ట అతిధులు వచ్చినప్పుడు ఎయిర్‌పోర్ట్ వంటి ప్రదేశాలలో మొదటి స్వాగత వచనం పలికే గౌరవం మేయర్‌దే! కార్పొరేటర్లకు ఇంచుమించు ఎమ్మెల్యేలతో సమానమైన రాజకీయ ప్రాధాన్యత లభిస్తుంది. ఇంత ప్రాధాన్యత కల్గిన ఈ సంస్థ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావించి రాజకీయ సమరం సాగించవల్సిన కాంగ్రెస్ నేతలు చేతకాక చతికిల పడిపోయారు.

కార్పొరేటర్ టిక్కెట్ల పంపిణీ ఒక్కటి చాలు - కాంగ్రెస్ ఎంత దుస్థితిలో వుండేది అర్థం చేసుకోవడానికి. పాతబస్తీ మినహాయిస్తే తతిమా నగరం అంతటా కాంగ్రెస్‌కు విజయావకాశాలు మెండుగా వున్నాయన్న ప్రచారం జరగడంతో టిక్కెట్లకు ఎక్కడలేని గిరాకీ వచ్చింది. ఒక్కొక్క స్థానానికి

తొరవ 12వ పేజీలో

సంక్రాంతి శుభాకాంక్షలతో



పి.వి.సి. పైప్స్

20 mm నుండి 180 mm వరకు అన్ని సైజులు లభించును.

ఆటోనగర్, నెల్లూరు - 5, Ph: (F) 311304, (R) 320578

అగ్రికల్చర్, ఆక్వాకల్చర్ పైప్స్ కొరకు సంప్రదించండి.

Mfrs. : PVC వాటర్ పైప్స్ & ఎలక్ట్రికల్ కాండ్యూట్స్



అకాల వర్షానికి కోయూరులో నేలకొరిగిన వెన్నుతీసిన వలపైరు.

పేనుకు పెత్తనమిచ్చిన తప్పు - సరిదిద్దుకోవాల్సింది పోలీసులే

న్యాయవ్యవస్థను చులకన చేయడం క్షమించదగిన నేరం కాదు!

అతి సర్వత్రా వర్జయేత్ అన్నారు పెద్దలు; ఈ చిన్న సూక్ష్మం గ్రహించ కోలేక పెద్ద సంక్షోభంలో కూరుక పోయింది జిల్లా పోలీసు వ్యవస్థ. ఒక్క సబ్‌ఇన్స్‌పెక్టర్‌ను అదుపు చేయలేని బలహీనతతో మొత్తం యంత్రాంగం వివాదాల వూబిలో గొంతు లోతుకు కూరుకపోయింది. ఎస్పీ ఐడి పార్టీ పోలీసుల దౌర్జన్యాలకు నిరసనగా నెల్లూరు టౌన్ న్యాయవాదులు గత 17 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నారు; జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు కోర్టులు బహిష్కరిస్తున్నారు; మరొక ప్రక్క ఆ ఐడి పార్టీ ఎస్‌ఐ వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పర్చవల్సిందిగా ఎస్పీని ఆదేశిస్తూ రెండవ అదనపు మేజిస్ట్రేట్ శ్రీమతి శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. చిలికి చిలికి గాలివానగా మారినట్లు ఇగో వివాదం న్యాయ, పోలీసు వ్యవస్థల మధ్య ప్రతిష్టాకర సమస్యగా మారిపోయింది.

ఎస్పీ శ్రీనివాసరెడ్డి గారికి ఎందువల్లనో ఐడి పార్టీ సబ్‌ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లుపై గురి కుదిరింది; గతమెంతో ఘన కీర్తి కల్గిన వాడీ ఇన్స్‌పెక్టర్. ఏ ఒక్క చోట కూడా గట్టుగా ఉద్యోగం చేసిన సాదృశ్యం లేదు. పైగా లెక్కలేనన్ని ఆరోపణలు వున్నాయి. శ్రీనివాసరెడ్డి వంటి ముక్కుసూటి అధికారి, వెంకటేశ్వర్లు వంటి వంకర ప్రవర్తన కల్గిన వుద్యోగిని తన ఆంతరంగికుడిగా నియమించు కోవడం విచిత్రం. పేనుకు పెత్తనం ఇస్తే ఏమి చేస్తుంది? తలంతా కొరికి తినేస్తుంది. ఇప్పుడదే జరిగింది.

ఐడి పార్టీ అనే ఈ విభాగానికి ఎస్పీ గారు చాలా కీలకమైన బాధ్యతలు అప్ప చెప్పారు. ప్రజలను నిలువునా దోచుకున్న బాలాజీ లాకర్స్, నెల్విన్ ఫైనాన్స్ వంటి దుకాకోరు సంస్థల వలలో చిక్కుకుని నిండా మునిగిపోయిన అమాయక పౌరులను కాపాడే బాధ్యత దీనికి ఇచ్చారు. చట్టం ప్రకారం వెళ్తే ఫైనాన్స్ కంపెనీల చేతిలో దగా పడిన వారికి న్యాయం జరగదు; కోర్టులో ఏదో ఒక మతలబు కనిపెట్టి నిరపాయకరంగా బయటకు వచ్చేస్తారు. హర్షద్ మెహతా వంటి వాడినే మన కోర్టులు ఏమీ చేయలేక పోయాయి కదా? వీటి వల్ల నష్టపోయిన వారికి ఎంతో కొంత పరిహారం ఇప్పించాలని తాపత్రయ పడ్డారు ఎస్పీ గారు. అందుకోసమే ఈ విభాగం. వెంకటేశ్వర్లు గత చరిత్ర ఒకసారి గమనించుకుని వుంటే ఈ తప్పు చేసివుండే వారు కాదనుకుంటాము. కోతికి కొబ్బరి కాయ ఇచ్చాడాయ.

ఎస్పీ చెప్పింది నష్టపోయిన అమాయక ప్రజలకు ఏదో ఒక రూపంలో పరిహారం ఇప్పించమని; కాని వెంకటేశ్వర్లు చేసింది - ఫైనాన్స్ కంపెనీలకు బాకీపడిన వారిని వేధించుక తినడం. దగా చేసిన కంపెనీ యజమానులు కూడబెట్టిన ఆస్తులు వెలికి తీసి, దోచిన డబ్బు కక్కించి దాన్ని డిపాజిట్‌దార్లకు పంచి వుంటే పేచీ వుండేది కాదు. కాని ఈ ఐడి పార్టీ ఆ యజమానులకు రక్షకురాలిగా మారింది. ఆయా సంస్థల నుంచి అప్పు తీసుకుని సకాలానికి చెల్లించలేక పోయిన వ్యాపారుల మీద తన ప్రతాపం చూపింది. అప్పులు తీసుకోవడం, చెల్లించలేకపోవడం సివిల్ కోర్టు పరిధిలోకి వచ్చే అంశాలు. దీనిలో పోలీస్ ప్రమేయం వుండకూడదు. కాని ఈ ఐడి పార్టీ తమ ప్రథమ కర్తవ్యం అప్పులు దండకం అన్నట్లు ప్రవర్తించింది. అందులోనూ చాలా దుందుడుకుగా వ్యవహరించింది. వీరు కొద్ది కొద్దిగా అప్పులు దండి, బాలాజీ లాకర్స్, నెల్విన్ బాధితులకు పరిహారం ఇస్తుండడంతో ఎస్పీ గారు ఈ పరిణామాల పట్ల చూసీ చూడనట్లు వుండి పోయారు. దాన్ని అలుసుగా తీసుకున్న ఐడి పార్టీ పోలీస్ క్లబ్ గెస్ట్ హౌస్‌ను తమ కార్యస్థానంగా మార్చుకుని అరాచకంగా ప్రవర్తించింది. ఫైనాన్స్ కంపెనీలకు బాకీ వున్నవారి ఇళ్లలోకి దౌర్జన్యంగా దూరి, వారిని అవమానకరంగా తిట్టి, పబ్లిక్‌గా రోడ్లలో నిలబెట్టి, జీపులో ఎక్కించుకుని వూరేగించి, పోలీస్ క్లబ్‌లో రోజుల తరబడి అక్రమంగా నిర్బంధించి, నానా చిత్ర హింసలు పెట్టారు. ఎస్పీ గారు ఏ కొంచెం మెలకువగా వుండి, అదుపుతప్పి పోతున్న వీరి ఆగడాలను కట్టడి చేసి వుంటవల్సింది. కాని ఎందువల్లనో ఆయన పట్టి పట్టనట్లు వుండిపోయారు.

రామలింగాపురానికి చెందిన తాటి సుందరరామిరెడ్డిని, ఆయన కుమారుడు వసంతకుమార్‌రెడ్డిని ఈ ఐడి పార్టీ ఎస్‌ఐ పోలీస్ క్లబ్‌లో నిర్బంధించాడట. ఎంత కాలానికీ వదలక పోవోసరికి సుందరరామిరెడ్డి భార్య మానవ హక్కుల కోర్టులో కేసు దాఖలు చేసింది. దానిపై న్యాయమూర్తి కృష్ణమోహన్ రెడ్డి స్పందన చూపి, కోర్టు కమిషనర్‌ను నియమించి పోలీసు క్లబ్‌కు పంపారు. ఆ పని మీద వెళ్లిన న్యాయవాది ఉమామహేశ్వర రావును ఎస్‌ఐ వెంకటేశ్వర్లు బండ బూతులు తిట్టి, దౌర్జన్యంగా బయటకు గెంటేయడంతో పాటు, కోర్టు కమిషనర్ సమక్షంలోనే తాను నిర్బంధించిన ఇద్దరిని చావచితక కొట్టాడట. ఉమామహేశ్వరరావు ఈ విషయాన్ని కోర్టుకు నివేదిక ఇచ్చాడు. ఉమామహేశ్వరరావు వివాదరహితుడు, నెమ్మదస్తుడు; అతడిపై పోలీసు దౌర్జన్యానికి నిరసనగా న్యాయవాదులు ఒక ప్రదర్శన జరిపి, జిల్లా జడ్జికి వినతి పత్రం ఇచ్చారు. ఎస్‌ఐని అరెస్ట్ చేసి కేసు పెట్టాలన్నది వారి కోరిక. కాని ఎస్పీ గారు అందుకు సమ్మతించక ఐడి పార్టీ బాధ్యతల నుంచి తప్పించి, ఏఆర్‌కు బదలీ చేశారు. ఇది కేవలం కంటి తుడుపు చర్యేనంటూ న్యాయవాదులు ఆందోళనకు దిగారు. గత రెండు వారాలుగా వారు కోర్టులకు వెళ్లక పోవడమే కాదు, నిరాహార దీక్షలు కూడా చేస్తున్నారు.

ఈ సమస్యకు ఏదైనా సామరస్య పరిష్కారం వెతికి వుంటే సరిపోయి వుండేది. కాని ఆ ఎస్‌ఐ తాను అన్నిటికి అతీతుడనన్నట్లు న్యాయవాదులపై దాడికి దిగాడు. ఆయన ఎరుకల కులానికి చెందిన గిరిజనుడు. దానితో కొందరు గిరిజనులను పోగేసి, గిరిజనుడైన తనపై న్యాయవాదులు అత్యాచారం చేస్తున్నారంటూ పోటి నిరసన శిబిరం ప్రారంభింపచేశాడు.

ఎందువల్లనో ఇప్పటి వరకు పోలీసు వున్నతాధికారులు ఈ సంక్షోభాన్ని చోద్యం చూశారు తప్ప, జోక్యం చేసుకుని సర్ది చెప్పడానికి ప్రయత్నించలేదు. దానికి తగ్గట్లే ఎస్పీ శ్రీనివాసరెడ్డి గత మూడు వారాలుగా నెల్లూరులో లేరు. శిక్షణ నిమిత్తం హైదరాబాద్‌లో మకాం పెట్టి వున్నారాయన. తనను అడిగేవారు

తొలవ 7వ పేజీలో

సానుభూతి



నీతినిజాయితీలకు ప్రతిరూపం,
మచ్చలేని రాజకీయ నాయకుడు,
మాకు అత్యంత ఆప్తుడు

శ్రీబెజవాడపాపిరెడ్డిగారి

మరణానికి చింతిస్తూ వారి కుటుంబానికి, వారి సోదరుల కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

... అడపాల గోపాలరెడ్డి
మరియు కుటుంబ సభ్యులు

రాజకీయాల్లో అజాతశత్రువు పాపిరెడ్డి!

బిజవాడ పాపిరెడ్డి గారు కన్ను మూశారు. డెబ్భై అయిదు సంవత్సరాల పూర్ణ జీవితం గడిపి సెలవంటూ ఈ లోకం వదలి వెళ్లిపోయారు.

పాపిరెడ్డి గారిది విలక్షణ వ్యక్తిత్వం, విచిత్ర రాజకీయం మతం. భూస్వామ్య సంప్రదాయ, కోపలిస్టు భావ సంపద కల్గిన వ్యక్తి ఆయన. ఇవి రెండు భిన్న ధ్రువాలు; రైలు పట్టాల వలె ఎప్పటికీ కల్సే అవకాశం లేదు. కాని పాపిరెడ్డి గారు మాత్రం తన వ్యక్తిత్వంలో వాటి రెండింటిని సమ్మిళితం చేశారు. ఆయనకు ప్రజలతో సంబంధాలు చాలా తక్కువ; కాని ప్రజా ప్రతినిధుల సభలు నాలుగింటికి సునాయాసంగా ఎన్నికైనాడాయన. ప్రజలతో నిమిత్తం లేకుండా రాజకీయం చేసి, అదే ప్రజలతో ఓట్లు వేయించుకోగల్గిన విద్య ఆయనకు దేము డిచ్చిన వరం. ఆయన మహా మాటకారి. నోరు విప్పితే హాస్యరసం గంగా ప్రవాహం వలె ప్రవహిస్తుంది; కాని వక్తగా మాత్రం ఎప్పుడూ రాణించలేక పోయాడు. ఆయనకు పెద్ద సోషలిస్టు అనే పేరు వుండేది; కాని ఏనాడు సోషలిస్టు సిద్ధాంతాలు చదవడం, అర్థం చేసుకోవడం, ఆచరించడం చేయలేదు.



నాలుగు చట్టసభలకు ఎన్నికైన రికార్డు ఆయన స్వంతం

ఆయన జీవితంలో ఏ కోణం నుంచి చూసినా ఈ విరుద్ధ భావాల సంఘర్షణ కన్పడుతుంది. అయితే వ్యక్తిగా ఆయన స్నేహపాత్రుడు. నవ్వడం, నవ్వించడం తప్ప మరొకటి తెలియదు. తన రాజకీయాన్ని, జీవిత గమనాన్ని, ప్రజా సాన్నిహిత్యాన్ని నవ్వులతోనే నింపివేశాడు. అట్లని ఎప్పుడూ నవ్వుల పాలు కాలేదు, తనను చూసి నలుగురు నవ్విపోయే అవకాశం ఇవ్వలేదు. అదే ఆయన ప్రత్యేకత.

పదవులు ఆయన ఇంటికి నడిచి వచ్చాయి - ప్రతిసారి! 1958లోనే రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు స్వతంత్రుడుగా ఎన్నికైనాడు; 1967లో ఒకసారి, 1983లో మరొకసారి అల్లూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శాసన సభ్యుడైనాడు; 1972లో రాజ్య సభకు, 1984లో లోక్‌సభకు ఎన్నికైనాడు. 1989లో మాత్రం తన చిరకాల మిత్రుడు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేతిలో కోవూరులో ఓటమి చవి చూడవల్సి వచ్చింది. అదే ఆయన రాజకీయ జీవితానికి చివరి అంకం. ఆ తర్వాత ఎప్పుడూ ఎన్నికల బోలికి వెళ్లలేదు. నాలుగు చట్ట సభలకు ఎన్నిక కాగలగడం పాపిరెడ్డిగారి అదృష్టం. రాష్ట్రంలోనే ఒక్క నేదురుమల్లి జనార్ధనరెడ్డి తప్ప మరెవ్వరికీ ఈ అదృష్టం కల్గలేదు. ఏ ఎన్నికలలో పోటి చేసినా - నామినేషన్ వేయడం తప్ప ఓట్ల కోసం తాపత్రయ పడడం పాపిరెడ్డి గారికి అలవాటు లేదు. ఆయన్ను అభిమానించే వారు, అనుచరులు తపనపడి, పిజంట్లను పెట్టుకొని, ఓటర్లను ప్రతిమలాడి పోలింగ్ బూతుల వరకు తెచ్చించుకోవల్సింది తప్ప - తాను మాత్రం తామరాకు మీద నీటి బొట్టు వలె పైపైనే తిరిగి వెళ్లి పోయేవాడు. గెల్చిన సంతోషంతో ఎప్పుడూ పుబ్బి తబ్బిబ్బు కాలేదు, ఓడిన దిగులుతో మంచం పట్టలేదు. గెలుపు ఓటముల పట్ల అంత నిర్వికారంగా వుండడం రాజకీయాలలో చాలా అరుదు. మరొక విశేషం - ఒకసారి ఎన్నికైన తర్వాత తనను ఎన్నుకున్న నియోజక వర్గం ముఖమే చూసే వాడు కాదాయన. సన్మానాలు, సభలపట్ల కూడా ఆయనకు ఆసక్తి వుండేది కాదు.

చట్ట సభలకు ఎన్నిక కావడం తప్ప - మంత్రిత్వం కోసమో, మరొక పెద్ద పదవి కోసమో ఎప్పుడూ ఆరాట పడలేదు. ఇస్తే వద్దనలేదు. అట్లా అడగకుండా వచ్చిందే ఎపిఐడిసి ఛైర్మన్ గిరి. ఏ పదవి అయినా ఆయనకు అలంకార ప్రాయం. దానితో వచ్చే సౌకర్యాల పట్ల మక్కువ చూపే వాడు కాదు.

పాపిరెడ్డి గారికి దేశ వ్యాప్తంగా వున్నత వ్యక్తులు చాలా మందితో సాన్నిహిత్యం వుంది. లోక్‌నాయక్ జయప్రకాష్‌కు ఆయన భక్తుడు. రామ్‌మనోహర్ లోహియా, అశోక్ మెహతా, ఆచార్య కృపలానీ వంటి వారందరితో వ్యక్తిగత పరిచయాలు నెరిపారాయన. ఈ మహిమాన్వితుల సంపర్కమే ఆయనలో సోషలిస్టు భావ సంపద పెంచింది. చివరి దశవరకు జయప్రకాష్ నారాయణ్ పట్ల ఆరాధనా భావం ఆయనలో కొనసాగింది. తన పదవులను కాని, తన పరిచయాలను కాని తన స్వంతం కోసం వాడక పోవడం పాపిరెడ్డి గారి గొప్పతనం. ఏ స్వార్థం లేని మానసం కాబట్టి, ఎవరికీ తలవంచవల్సిన అవసరం ఏర్పడలేదు. ఎన్‌టిఆర్ వంటి అహంభావపూరిత నేతను సైతం సమ స్థాయిలో చూశాడే తప్ప ఎంగి ఎంగి దండాలు పెట్టలేదు.

ఎవరిని, ఏ సమయంలోనూ పరుష పదాలతో విమర్శించక పోవడం ఆయనలోని మరొక విలక్షణ గుణం. ఎంత తీవ్రమైన రాజకీయ వివాదం వచ్చినా మనసును గిలిగింతలు పెట్టే చతురోక్తులతో సమాధానం చెప్పేవాడే తప్ప, తిట్లకు లంకించుకునే వాడు కాదు. అట్లని తన మనసులో కల్గిన అభిప్రాయాలను వెలికి చెప్పడానికి వెనకాడే వాడు కాదు. నిర్మొగమాటం, నిష్కర్షల వల్ల ఆ భావాలు ఎంత పదును తేరినప్పటికి, వాటికి తేనె పూత వంటి చతురోక్తి కలగల్సివుండేది కాబట్టి ఆయన విమర్శలకు ఎవరు నొచ్చుకునే

తొలవ 7వ పేజీలో

అమెరికాతో జాగ్రత్త!

ప్రక్కవాడి ఇల్లు తగలబడుతుంటే మట్ట కాల్చుకోవడానికి కావాల్సినంత నిప్పు దొరికిందని సంబర పడినట్టుంది అమెరికా తీరు. ఇండియా, పాకిస్తాన్ దేశాల మధ్య చెలరేగుతున్న ఉద్రిక్తతలు అవకాశంగా తీసుకుని దక్షిణాసియాలో శాశ్వత స్థిరనివాసం ఏర్పర్చుకోవడానికి కుట్ర పన్నుతున్నారు అమెరికన్ నేతలు.

ఇండియా, పాకిస్తాన్‌లది దాయాది పోరు; కొన్ని దశాబ్దాలుగా ఆ రావణ కాష్టం రగులుకొంటూనే వుంది. పార్లమెంట్‌పై తీవ్రవాదులదాడి తర్వాత రెండు దేశాల మధ్య ఎంతటి ఉద్రిక్తతలు చెలరేగుతున్నది తెల్సిందే. ఇరు పక్షాలు కయ్యానికి కాలు దువ్వుతున్నాయి; సరిహద్దులలో సైన్యం మోహరించి వుంది; తుపాకి గుండ్ల వర్షం కురుస్తున్నది; ఎక్కడ ఏ వేదిక దొరికినా ఒకరిపై మరొకరు నిప్పులు క్రుమ్మరించుకుంటున్నారు; ఏ క్షణంలోనైనా యుద్ధం ప్రారంభం కావచ్చునన్నంత తీవ్రంగా వుంది పరిస్థితి. ఈ కక్షల కొలిమిలో చలి కాచుకోవాలన్నది అమెరికా తాపత్రయం.

దక్షిణాసియాలో ఇన్నేళ్లుగా అమెరికాకు స్థానబలిమి లేదు; డెగోగర్షియా వంటి స్థావరాలలో సైనిక కేంద్రాలు నెలకొల్పి ఈ ప్రాంతం రాజ్యాలను తన గుప్పెట్లో పెట్టుకోవాలన్న కోరిక అమెరికాకు ఎంత కాలం నుంచో వుంది; అయితే రష్యా, చైనాల ప్రతిఘటనతో అది ఇంత కాలం సాధ్యం కాలేదు. ఆఫ్గనిస్తాన్ దురాక్రమణలో ఆ రెండు సైనిక సంపత్తి కల్గిన దేశాలతో పాటు ఇండియా వంటి కీలక రాజ్యాలు సైతం అభ్యంతర పెట్టకపోవడంతో అమెరికాకు అలుసై పోయింది. తలదాచుకోవడానికి నీడ ఇస్తే ఒళ్లంతా దూర్చి గుడారాన్ని దురాక్రమించే ఒంటె వంటిది అమెరికా.

ఇండియా, పాకిస్తాన్ దేశాలకు వారు ఇస్తున్న సలహాలు, చేస్తున్న హెచ్చరికలు, జరుపుతున్న దౌత్య ప్రయత్నాలు వారి దుర్బుద్ధిని నగ్నంగా ప్రదర్శిస్తున్నాయి. యుద్ధం తలపెట్టకుండా సమస్యలు పరిష్కరించుకునే విధంగా భారత, పాకిస్తాన్‌లను వప్పించేందుకు తాము కృషి జరుపుతున్నామనే అందమైన ప్రచారంతో ఈ రెండు దేశాల ఆంతరంగిక విషయాలలో ప్రత్యక్ష జోక్యం చేసుకుంటున్నాడు జార్జి బుష్. దాదాపు ప్రతి రోజు వైట్‌హౌస్ ప్రతినిధి మన దేశంలోని వ్యవహారాలపై ఏదో ఒక వ్యాఖ్య చేస్తూనే వున్నాడు. ఈ రెండు దేశాల మధ్య సమన్వయం సాధించడానికి ప్రత్యేక దూతను పంపుతున్నామని ప్రకటించారు. వారి ఆంతరంగిక మంత్రి సెక్రటరీ పావెల్ వచ్చే వారం న్యూఢిల్లీ, ఇస్లామాబాద్‌లలో పర్యటించబోతున్నాడు. ఉగ్రవాదులపై తీసుకోవల్సిన చర్యలపై పలు మార్లు పాకిస్తాన్‌కు సలహాలు, సూచనలు ఇచ్చారు. కాశ్మీర్ సమస్య పరిష్కారంలో మనం మరింత నిగ్రహంతో వ్యవహరించాలని వాజ్‌పాయికి సలహా ఇస్తున్నారు. బ్రిటన్ ప్రధాని ఇండియా పర్యటనలో కాశ్మీర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

సెక్రటరీ పావెల్ పర్యటన ఉద్దేశ్యం - రెండు దేశాలు తాము చెప్పినట్లు నడుచుకోకుంటే పరిణామాలు తీవ్రంగా వుంటాయని హెచ్చరించడం తప్ప వేరు కాదు. ఆయన్ను రమ్మని ఎవరూ పిలవలేదు. ప్రత్యేక దూతను పంపుతామన్న ప్రతిపాదనను మన ప్రధాని వాజ్‌పాయి నిర్ద్వంద్వంగా తిరస్కరించిన తర్వాత పావెల్ తనకు తానుగా ఈ పర్యటన తలపెట్టడంటే - మేము రావద్దని చెప్పడానికి మీరెంతటి వారు అని హేళన చేయడం తప్ప వేరు కాదు.

సమకాలీన అంతర్జాతీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే అమెరికా చేపడుతున్న ఈ చర్యలు ఎంతటి ప్రమాదకరమైనవో అర్థమౌతున్నాయి. ఆఫ్గనిస్తాన్ దురాక్రమణ తర్వాత అమెరికా దురహంకారానికి అవధులు లేకుండా పోయాయి. ఒసామా బిన్‌లాడెన్ పేరుతో ఒక దేశం యావత్తును నాశనం చేశారు వారు. కొన్ని వేల మంది అమాయక పౌరులను చంపారు. పాకిస్తాన్‌లోని మిలటరీ పాలకుల రాజకీయ బలహీనతలను ఆసరాగా జేసుకుని ఆ దేశ సార్వభౌమత్వాన్నే అవహేళన చేస్తూ జకోబాబాద్‌లో తమ సైనిక స్థావరం నెలకొల్పారు. ఆ దేశ ప్రజల మనోభావాలను, పాలకుల అనుమతిని పట్టించుకోకుండా యుద్ధ విమానాలతో గగన విహారం చేస్తున్నారు. తమ సైనిక అవసరాల కోసం పాకిస్తాన్ సైన్యాన్ని ఆఫ్గన్ సరిహద్దులలో మోహరింప చేస్తున్నారు. ఇంత చేసి వీరు సాధించింది శూన్యం. ఒసామాబిన్ లాడెన్ దొరకలేదు; ముల్లా ఒమర్ అసలే పట్టుబడలేదు; తాలిబన్ ప్రభుత్వాన్ని పతనం చేయించగలిగారు కాని, వారి తీవ్రవాద వ్యవస్థను మాత్రం నిర్మూలించలేక పోయారు. దాదాపు 64 దేశాలలో తాలిబన్ సైనికులు తలదాచుకుని వున్నారని అంచనా. ఎప్పుడో ఎక్కడో అవకాశం దొరికినప్పుడు వారు మరొకసారి తమ విశ్వ రూపం ప్రదర్శించడం ఖాయం. ఒక్క తీవ్రవాదిని పట్టుకోవడం కోసం ఒక దేశాన్నే సర్వనాశనం చేయడానికి సిద్ధపడిన క్రూర మనస్తత్వం అమెరికాది. తమ దేశ అవసరాలకోసం, తమ ప్రజల ఆర్థిక ప్రయోజనాల కోసం ఎవరినైనా బలిపెట్టడానికి, ఎంతటి విధ్వంసం సృష్టించడానికి వెనుకాడని స్వార్థపరులు వారు.

అటువంటి సంకుచిత మనస్తత్వం కల్గిన వారిని మన ఆంతరంగిక వ్యవహారాలలో వేలు పెట్టనిస్తే జరిగే ప్రమాదం భయానకమైనది. బ్రిటీష్ పాలకుల చెర నుంచి తప్పించుకోవడానికి వందల ఏళ్ల సుదీర్ఘ సమయం పట్టింది మన పూర్వీకులకు. కొన్ని లక్షల మంది దేశ భక్తులు ఆ సమరంలో తమ ప్రాణాలు త్యాగం చేశారు. వారి రక్త తర్పణంతో సాధించుకున్న దేశ సార్వభౌమత్వం, స్వాతంత్ర్యం హరించుకుని పోయే ప్రమాదం ఏర్పడుతున్నది ఇప్పుడు. ఇండియా, పాకిస్తాన్‌లు రెండూ రాజకీయ పరిపక్వత సాధించిన రాజ్యాలు. మన వ్యవహారాలను మనమే పరిష్కరించుకోగల్గిన విజ్ఞత మనకు వుంది. మనం యుద్ధం చేయాలా లేక చర్చలు జరపాలా అన్న నిర్ణయం అమెరికా వంటి పెత్తందారుల చేతిలో పెట్టవల్సిన అవసరం ఎంత మాత్రం లేదు. మన ఆత్మ గౌరవాన్ని తాకట్టుపెట్టి వారి మధ్యవర్తిత్వంలో నెరుపుకోవల్సిన దౌర్భాగ్య పరిస్థితి మనకు వద్దు కాక వద్దు.

గత యాభై ఏళ్ల అమెరికా చరిత్ర పరికిస్తే, వారు తలదూర్చిన ప్రతి దేశంలో ఏమి జరిగిందో సింహావలోకనం చేస్తే ఇప్పుడు వారు ఇండియా, పాకిస్తాన్ల విషయంలో మొదలు పెడుతున్న ప్రయత్నం ఎక్కడకు దారి తీస్తుందో అర్థమౌతుంది. వీరు పాదం మోపిన ప్రతి చోటా దేశాలకు దేశాలే సర్వ నాశనమై పోయాయి. తైవాన్ వంటి ఒకటి రెండు దేశాలలో వివిధ కారణాల వల్ల అమెరికన్లు తమ దేశీయ తత్వం మాని, అభివృద్ధికి సహకరించిన మాట నిజమే అయినప్పటికి తతిమా ప్రపంచంలో వీరి చరిత్ర సమస్తం పర పీడన పారాయణత్వమే. ఇండియా వంటి దేశాల అభివృద్ధి వీరికి ఎంత మాత్రం సహ్యం కాదు. అపారమైన మానవ వనరులు, విజ్ఞాన సంపద, సహజ వనరులు, సాంకేతిక పరిజ్ఞానం కల్గిన ఇండియా సర్వ స్వతంత్రంగా వ్యవహరిస్తే తమ అధికారానికి ఎప్పటికైనా ముప్పు అనే అంచనాతో మన అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపుల్లలు వేయడం మనకు తెల్సిందే. వారు ఎప్పటికీ మన హితైషులు కారు, కాలేరు. ఏదో ఒక సాకుతో మన ఆంతరంగిక వ్యవహారాలలో వేలు దూర్చి, మనల్ని కట్టడి చేయడం మాత్రమే వారి లక్ష్యం అన్నది నిజం. అటువంటి ప్రమాదకారులను పిల్చి పీట వేయడం ఆత్మహత్యా సదృశ్యం అవుతుంది. ఈ వాస్తవాన్ని గుర్తెరిగి ప్రవర్తించడం, అమెరికన్ల అనవసర జోక్యానికి ఆదిలోనే అంతం పలకడం కేంద్ర ప్రభుత్వ నేతల కర్తవ్యం.

జమీన్‌రైతు

11.1.1952

పేజీలు: 12 వెల: 0-3-0

కాంగ్రెస్ దెబ్బతినడానికి కారణం

జిల్లాలో ఎన్నికలు పూర్తయి పోయ్యాయి. ఇప్పటికి ప్రకటింపబడిన ఆరు ఫలితాలలో మూడు కాంగ్రెస్‌కు, రెండు ప్రజా పార్టీకి, రెండు కమ్యూనిస్టులకు లభించాయి. పత్రిక మీచేతి కందేలోగా మరి రెండు, మూడు ఫలితాలు ప్రకటింపబడవచ్చు.

***

మన జిల్లా ఎన్నికల ఫలితాల సరళిని గమనిస్తే మనం ఆశ్చర్య పడడం కాదు. ఆంధ్రదేశమంతా విస్తుబోతున్నది. దీనికి కారణం లేకపోలేదు. రాజకీయ చైతన్యంలో వెనుకబడిన జిల్లా మనది. ఏ విషయంలోనూ వెర్రి ఆవేశాలకు లోనుగాక, స్థిమిత వాతావరణంలో వుంటుంది. అలాటి జిల్లాలో ఎవ్వరూ వూహించని పరిణామాలు సంభవించాయంటే విశేషమే గదా!

***

ఈ పరిణామాల్లో అత్యంత ఆశ్చర్యకరమైంది. ఉదయగిరి ఫలితం. ఒక్క గోపాలరెడ్డి గారు, జిల్లాలోని ఏ వ్యక్తి గూడా ఉదయగిరి విషయంలో ఈ పరిణామం కలుగుతుందని కలలో గూడా అనుకోలేదు.

దీనికి కారణం కోవి రామయ్య చౌదరి గారి పలుకుబడి అనిగాని, ప్రజా పార్టీ బలమనిగాని గోపాలరెడ్డి

50 పల్లె క్రితం

గారిపై వున్న వ్యతిరేకతని గాని ఎవరైనా అనుకుంటే అంతకంటే పొరపాటుండదు. ఉదయగిరి విఫలతకు కారణాలను తరచేముందు, జిల్లాలోని ఇతర పరిస్థితులను గూర్చి విచారించడం అవసరంగా వుంటుంది.

***

తరువ 10వ పేజీలో

జనవాణి

సార్క్ సదస్సు సాధించిందేమిటి?

సార్క్ దేశాల శిఖరాగ్ర సమావేశం ఖాట్మండులో ముగిసింది. కాని ఈ సమావేశంలో కీలక నిర్ణయాలేవీ తీసుకోలేదు. సార్క్‌లోని సభ్యదేశాలన్నీ బడుగుదేశాలే. ఇవన్నీ ఒక కూటమిగా ఏర్పడి ఆర్థికంగా వాణిజ్యపరంగా సహకరించుకుంటే అంతకంటే మేలు మరొకటి లేదు. కాని ఈ సహకారం గట్టిపడితే అగ్రరాజ్యాల పునాదులు కదులుతాయి. వాటి దుష్టపన్నాగాలు పారవు. అందువల్ల అగ్రరాజ్యాలు వెనుకవుండి ఒక పథకం ప్రకారం సార్క్ దేశాల మధ్య పొరపొచ్చులు కలిగేలా చేస్తున్నాయి. సార్క్ కూటమిలోని పాకిస్తాన్ తెచ్చే చిక్కులను తప్పించుకోను మిగతా దేశాలు అగ్రరాజ్యాలతో సంప్రదించక తప్పదం లేదు. పాకిస్తాన్ సార్క్ దేశాల జాబితాలో లేకుంటే, సార్క్ వేదిక అగ్రదేశాలకు సవాలుగా వూరివుండేది. 6తేది ముగింపు సదస్సులో నిర్ణయాలు చివరికి ఏమి సాధించవు.

నెల్లూరు — వి.సత్యనారాయణ

నిఘా వ్యవస్థ నిద్రపోతుందా?

కాశ్మీర్ అసెంబ్లీపై ఉగ్రవాదులు రెండవసారి కూడా ధైర్యంగా దాడులు జరిపారు. ఇక్కడ తరచూ ఉగ్రవాదులు పెట్రేగి పోతున్న విషయాన్ని గుర్తించిన తర్వాతనైనా నిఘా వ్యవస్థను అప్రమత్తం చేసివుండాల్సింది. ప్రస్తుత పరిస్థితులు ఉగ్రవాదులు దేశంలో ఎక్కడైనా భీభత్సం సృష్టించే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. దీనివల్ల నిఘా వ్యవస్థ తీరు మెరుగుపడాలి. సరిహద్దు ప్రాంతంతో పాటు దేశంలోని అన్ని కీలక ప్రాంతాల్లో రక్షణ ఏర్పాట్లు పటిష్టం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన శ్రద్ధ తీసుకోవాలి. ఉగ్రవాదులకు తగిన బుద్ధి

తరువ 10వ పేజీలో

మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
సంక్రాంతి శుభాకాంక్షలు
Polo కంపెనీవారి జీన్స్, కాటన్ జీన్స్‌లపై రూ.175/- తగ్గింపు
Loyds India కంపెనీ షర్ట్స్‌పై రూ.50/- తగ్గింపు
విచ్చేయండి
వెరైటీఫ్యాషన్ పాయింట్
Opp. మాధవ థియేటర్, ఆర్.ఆర్. స్ట్రీట్, నెల్లూరు. ఫోన్: 332135

చినుకుపడితే ఛిద్రమే

చినుకుపడితే నెల్లూరు టౌన్‌లో జనజీవనం అస్తవ్యస్తమై పోతుంది. జన సంచారం ఎక్కడికక్కడే నిలబడి పోవాల్సి వస్తుంది. ముందుచూపులేని అధికార యంత్రాంగం వేయించిన

నెల్లూరు జీవితం అతలాకుతలం

రోడ్లు, కట్టించిన డ్రైనేజీలు, పూడిపోయిన డ్రైనేజీలు, బాధ్యతారహితంగా ప్రజలు కట్టిస్తున్న కట్టడాలే దీనికి కారణం. సోమ, మంగళ, బుధ వారాల్లో కురిసిన వర్షాలకు అయ్యప్పగుడి నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు జాతీయరహదారిపై వేదాయపాళెం, పెద్దాస్పత్రి, వెంకటరమణా థియేటర్స్ కాంప్లెక్స్, సింధూర నర్సింగ్‌హోమ్, వహాబ్‌పేట సెంటర్, గాంధీబొమ్మ, ట్రంకురోడ్డు సెంటర్లలో మోకాలు లోతుపైగా నీళ్లు పారాయి. ఈ నీటిపై స్కూటర్లు, ఆటోలు, కార్లు వెళ్లడం కనాకష్టమయ్యింది. ప్రధాన రహదారి పరిస్థితే ఈ విధంగా వుంటే, ప్రక్కరోడ్ల పరిస్థితి మరీ దారుణంగా వుంది. ఆర్టీసి బస్టాండ్ ప్రక్కన వుండే శోధన్‌నగర్, రామలింగాపురం, హరనాథపురం, బాలాజీనగర్ ప్రాంతాల్లో డ్రైనేజీలు సరిగ్గా లేకపోవడం వల్ల వర్షపు నీరంతా

తొరవ 11వ పేజీలో



నెల్లూరు డిఆర్‌డబ్ల్యూ కాలేజిలో జిమ్‌ను ప్రారంభించి వ్యాయామం చేస్తున్న ఎమ్మెల్యే వివేకానందరెడ్డి. ఆశ్చర్యపోయి చూస్తున్న షుక్లే సమాచారమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి.

రాజకీయాలొద్దు - ప్రగతే ముద్దు!

నెల్లూరు పట్టణ ప్రగతి కోసం రాజకీయాలకు అతీతంగా పాటుపడాల్సిన అవసరం ఎంతైనా వుందని సమాచారశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నవాబుపేట బివిఎస్ గర్ల్స్ హైస్కూల్‌లో జరిగిన జన్మభూమి సభలో మంత్రి అనర్గళంగా

సోమిరెడ్డి

మాట్లాడారు. ఏలూరు మునిసిపాలిటీ తన ఆదాయవనరులు పెంచుకొన్న విధంగా నెల్లూరు మునిసిపాలిటీ ఒక ప్రణాళిక తయారు చేసుకోవాలి. ఎఫ్‌డిఆర్ క్రింద 46లక్షల రూపాయలు మునిసిపాలిటీకి మంజూరయ్యాయి. వీటితో అభివృద్ధి పనులు మొదలు పెడతారు. బ్రిటన్ ప్రభుత్వ గ్రాంటు 40కోట్ల రూపాయలతో మురికివాడల అభివృద్ధి కోసం చేపట్టనున్న పథకం తర్వితగతిన పనులు ప్రారంభించేందుకు తనవంతు సహకార మందిస్తానన్నారు. రైతు జన్మభూమిలో మిగిలిన 22లక్షల రూపాయలతో నవాబుపేటలోని రైతు బజారును అభివృద్ధి చేస్తామన్నారు. టౌన్‌లో 101కోట్ల రూపాయలో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజి సిస్టమ్స్‌కు వాల్కో రుణం మంజూరు చేయను తనవంతు కృషి చేస్తానన్నారు. 30కోట్లతో నెల్లూరు చెరువులో మినీ రిజర్వాయరు ఏర్పాటు చేసె ప్రతిపాదనలు తయారు చేయమని పబ్లిక్ హెల్త్ శాఖ ఎస్ఇని ఆదేశించినట్లు చెప్పారు. ఎమ్పి డాక్టర్ వుక్కాల రాజేశ్వరమ్మ మాట్లాడుతూ నెల్లూరు పట్టణ అభివృద్ధికి ఎమ్పి ఫండ్స్ నుంచి కోటి రూపాయలకుపైగా నిధులు ఇచ్చానన్నారు. వెంకటేశ్వరపురం వద్ద

తొరవ 11వ పేజీలో

పేకాటలో లక్షల మాయాజాలం

నెల్లూరు పట్టణ నడిబొడ్డులోని మెక్లిన్స్ క్లబ్‌లో గత ఏడేళ్లుగా పాతుకపోయిన పాలక వర్గం అవినీతికి పాల్పడుతూ కోట్ల రూపాయలు వెనకేసుకొందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కాదేదీ అవినీతికి అనర్హమంటూ పాలకవర్గం చీట్ల పేకలు కొనుగోలు, అమ్మకం, గెస్ట్ ఫీజులు, గిఫ్టుల కొనుగోలులో పెద్ద మొత్తాలు దిగమింగడం విశేషం. 1864 సంవత్సరంలో అప్పటి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన మెక్లిన్స్ నెల్లూరీయుల్లో విజ్ఞానం పెంపొందింప జేయాలన్న వుద్దేశ్యంతో మెక్లిన్స్ రీడింగ్ రూమును పెట్టారు. విజ్ఞానం సంగతెలా వున్నా పేకాటకు ఇది నిలయమైంది. రీడింగ్ రూమ్‌తోపాటు రిక్రియేషన్‌కు ఒక ఇండోర్ షటిల్ స్టేడియం, క్యారమ్ బోర్డులు, చెస్‌బోర్డులు, టెన్నిస్ కోర్టులతో అత్యాధునిక క్లబ్‌గా ఒకటిన్నర ఎకరా విస్తీర్ణంలో కాలక్రమేణ రూపుదిద్దుకొంది. ఇక్కడ క్యారమ్స్, చెస్, టెన్నిస్, షటిల్ ఆడే వాళ్లు తక్కువ; చీట్లాట ఆడేవాళ్లే ఎక్కువ. ఈ చీట్లాటే పాలకవర్గాన్ని కుబేరులు అయ్యేందుకు సహకరిస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిస్టర్ అయిన క్లబ్‌లో రమ్మి, జాక్‌పాట్ వంటి

మెక్లిన్స్ క్లబ్‌లో చేత"వాటాలు"

ఆటలను నామమాత్రపు ఫీజులతో ఆడాలి. కాని ఇక్కడ జాక్‌పాట్ ఆటకు వెయ్యి రూపాయలు, రమ్మిలో పాయింట్‌కు 20రూపాయలకు పైగా డబ్బులు పెట్టి ఆడుతున్నారు. 600పైగా సభ్యులు నమోదై వుండే ఈ క్లబ్‌లోలోని బ్యాంకులో పేకాటపై నిత్యం లక్షలాది రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయి.

ఈ క్లబ్‌లో ఒక రోజుకు 25డజన్ల పేక ముక్కలు ఆటకు ఉపయోగిస్తున్నారు. మూడు రకాల టేబుళ్లకు మేజాకు 120, 200, 350 రూపాయల లెక్కన ప్రతినిత్యం 25వేల రూపాయలు క్లబ్‌కు ఆదాయమొస్తుంది. చీట్లాట ఆడేందుకు ఈ క్లబ్‌కు గెస్ట్‌లుగా కనీసం నిత్యం 150 మంది వస్తుంటారు. గెస్ట్ ఫీజుగా వీరి వద్ద నుంచి 20 రూపాయలుగా వసూలు చేసే మొత్తంతో మరో మూడు వేలు వస్తాయి. వాడిన 25 డజన్ల పేకలు ప్రతిరోజు అమ్మివేయడం వల్ల మరో 1800 రూపాయలు జమపడతాయి. అన్ని విధాలుగా వచ్చే ఆదాయా

తొరవ 11వ పేజీలో

చుక్కమన్న చికెన్ ధర!

ఈ మధ్య కాలంలో ఎప్పుడూ లేనివిధంగా కోడిమాంసం (చికెన్) ధరలు ఒక్కసారిగా చుక్కలంటాయి. కోడి మాంసానికి అనూహ్యంగా డిమాండ్ పెరగడం వరుసగా వచ్చిన పండుగలు, డిమాండ్‌కు తగినట్లు కోళ్లఫారాలు

నెల్లూరుసంగతులు

లేకపోవడం ధరలు పెరుగుదలకు కారణమయ్యాయి. నవంబరు నెల వరకు కిలో 45రూపాయలమ్మిన చికెన్ ఒక్కసారిగా 75 రూపాయలై పోయింది. స్కిన్‌లెస్ మాంసం కిలో 56 రూపాయలు అమ్ముతుండింది. 85 రూపాయలకు చేరుకొంది. డిశంబర్ రెండవ వారం నుంచి ఒక్కసారిగా చికెన్ రేట్లు పెరిగిపోతూ వచ్చాయి. రంజాన్, క్రిస్టమస్, జనవరి 1తేది వంటి పండుగలు వరుసగా రావడంతో తగినన్ని బాయిలర్ కోళ్ల ఫారాలు లేకపోవడంతో చికెన్ రేట్లు అనూహ్యంగా పెరిగిపోయాయి. సంక్రాంతికి కిలోకు నాలుగు రూపాయలు పెరిగే అవకాశం వుందని నెల్లూరులో హోల్‌సేల్ చికెన్ వ్యాపారి చాన్‌బాషా చెప్పారు. అంత్రాక్స్ వ్యాధి భయంతో ఈ మధ్య తగ్గిన మటన్ రేటు, చికెన్ రేటు పెరగడంతో ఎప్పటి మాదిరిగా మళ్లి 130 రూపాయలయ్యింది. పండుగలు, పబ్బాలకు మాంసాహారం తప్పనిసరి కావడంతో చికెన్, మటన్ రేట్లు తరచూ మారుతున్నాయి. చికెన్ రేటు ఇంతగా పెరిగినా

తొరవ 11వ పేజీలో

నోట్లకోసం నోళ్లు తెరిచిన హాళ్లు

నెల్లూరు పట్టణంలో సభలు, సమావేశాలు, పెళ్లిళ్లు జరుపుకొనే హాళ్లు, వేదికల అద్దె రేట్లు సామాన్యులకు అందుబాటులో లేవు. ప్రభుత్వ యాజమాన్యంలో నడిచే హాళ్ల రేట్లు, ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే హాళ్ల రేట్ల కన్నా ఎక్కువగా వున్నాయి. జిల్లా రెవిన్యూ అధికారి ఆధీనంలో వుండే కస్తూరిభా కళాక్షేత్రానికి రోజుబాడుగ 6వేలు, కరెంటు ఛార్జీల కోసమని 2,500 డిపాజిట్, నిర్వహణ వ్యయం పేరిట మరో 300 రూపాయలు కట్టించుకొంటున్నారు. అక్షరాల 8,800 రూపాయలు చెల్లిస్తే ఈ హాల్‌ను బుక్ చేస్తారు. దీని వల్ల ఇక్కడ స్థోమత వున్నవారు మినహా సామాన్య కళాకారులు, సంఘాల వారు సభలు, ఇతర కార్యక్రమాలు ఏర్పాటు చేసుకొనే పరిస్థితి లేదు. పెద్ద మొత్తంలో బాడుగలు వసూలు చేస్తున్న కళాక్షేత్రంలో హాలు నిర్వహణ సరిగా లేదు. హాల్‌లో చాలా కుర్చీలు విరిగిపోయాయి. ఫ్యాన్లు తిరగడమే లేదు. పట్టణ నడిబొడ్డులోని ఇందిరాభవన్ ఒకరోజు బాడుగ ఐదు

శుభకార్యాల ఖర్చు తడిసి మోపెడు

వేలు. దీన్ని బుక్ చేసుకొన్న పెళ్లిళ్ల పార్టీలు బాత్‌రూమ్‌కు గాంధీబొమ్మ వద్ద గల సులభ్ కాంప్లెక్స్‌కు వెళ్లాల్సిందే. ఏళ్ల తరబడి ఇక్కడ బాత్‌రూమ్‌లు లేకపోయినా ఇందిరాభవన్ నిర్వాహకులు అసలు పట్టించుకోవడం లేదు. కేవలం 250 మంది కూర్చొనే వసతి వున్న సరస్వతినగర్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ రోజు బాడుగ 3,800 రూపాయలు. కరెంట్‌కు యూనిట్‌కు ఎడు రూపాయలు చెల్లించడంతోపాటు నిర్వహణకు మరో 250 రూపాయలు కట్టాలి. వసతి సౌకర్యాలు బాగానేవున్న టిటిడి కళ్యాణ మండపం బాడుగ ఐదు వేల పైమాటే. రంగనాయకులపేటలో వున్న మూడు ముఖ్య కళ్యాణ మండపాల బుకింగ్‌కు, కరెంట్, నిర్వహణ ఛార్జీలకు ఏడెనిమిది వేలు ఖర్చు పెట్టాల్సిందే. దర్గామిట్టలోని ఎన్‌జిఓ హోంకు భారీగానే ఛార్జ్ చేస్తున్నారు. ఈ మధ్య పట్టణంలో కొత్తగా మాగుంట లేఅవుట్‌లో కట్టిన సిపిఆర్ కళ్యాణ మండపం, సాయి కళ్యాణ మంటపాల్లో కార్యక్రమాల

తొరవ 11వ పేజీలో

చందనలో హ్యాండ్‌లూమ్ చీరలపై భారీ తగ్గింపు ధరలు
మెగా టెక్స్‌టైల్ షోరూమ్
వెంకటగిరి, గద్వాల్, పొటూరు, ధర్మవరం, పిరియపాళెం, చీరాల, బండారులంక, మాధవరం చేనేత చీరలపై
అత్యంత తగ్గింపు ధరలు
మేడ్ టు ఫ్యాషన్
ప్రముఖ కంపెనీల జీన్స్, షర్ట్స్, ట్రౌజర్స్, బాబా సూట్స్, చుడీదార్స్, మిడ్డీస్, ఫ్రాక్స్, పంజాబీ డ్రస్సులపై
భారీ తగ్గింపు
పంచెలు, కండువాలు, టవల్స్, లుంగీలు, బెడ్‌షీట్స్‌పై
మీరూహించని తగ్గింపు
చందన బ్రదర్స్
లేడీస్ & జంట్స్ క్లాత్ షోరూమ్
జి.టి. రోడ్, ఫోన్: 323420
నెల్లూరు
ALL BANK CARDS ACCEPTED
Rajl Ads, Ph: 327721

వేలుపెడితే కొరికేస్తాం!

మంత్రి సోమిరెడ్డికి పంచ పాండవుల హెచ్చరిక

పంచపాండవ తెలుగు ఎమ్మెల్యేల అసమ్మతి క్షేత్రయాత్రతో చెన్నూరు జన్మభూమి సభ దద్దరిల్లింది. కోవూరు, అల్లూరు, కావలి నియోజక వర్గాల్లో జటివల చంద్రమోహన్‌రెడ్డి వేలు పెట్టడంతో కందిరీగల తుట్టె కదల బారినట్టయ్యింది. చెన్నూరు సభలో ఎవరికి తోచిన రీతిలో వారు సోమిరెడ్డిని తిట్లతో తూట్లు పొడిచేశారు. మంత్రి చంద్రమోహన్‌రెడ్డిపై మాజీ మంత్రులు ఆదాల, ప్రసన్న, ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి దూషణల పంచాగం ఎత్తి, దుమ్మెత్తి పోశారు. దీంతో జన్మభూమి సభ కాస్తా అసమ్మతీయులకు రణక్షేత్రంగా మారినట్టయ్యింది. మంత్రి సోమిరెడ్డికి ఆయన బావమరిది ప్రసన్న నెల్లూరు ఒస్మాబిన్‌లాడెన్ అన్న బిరుదును ఈ సభలో ప్రదానం చేశారు. ఆఫ్గనిస్తాన్ లాడెన్ తీవ్రవాద చర్యలతో ఎలా నాశనం అయ్యిందో నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ చంద్ర మోహన్‌రెడ్డి వర్గ రాజకీయాలతో సర్వ నాశనం అయిపోతుందని అన్నాడు. తనకు తెలియకుండా తన నియోజక వర్గమైన కోవూరులో కాలుపెట్టి గ్రూపు రాజకీయానికి బీజం వేసేందుకు

కొరవ 8వ పేజీలో



కట్టువపల్లె జన్మభూమి సభలో పేదలకు ఇళ్లస్థలాల పట్టాలు పంపిణీ చేస్తున్న రాపూరు ఎమ్మెల్యే రామనారాయణరెడ్డి. ప్రక్కన జడ్పీ వైస్‌ఛైర్మన్ పద్మనాభరెడ్డి.

ప్రకృతి కన్నెర్రతో కకావికలం

జిల్లావార్తలు

నెల్లూరు జిల్లాపై ప్రకృతి పగపట్టినట్టుంది. గత నాలుగేళ్లుగా అతివృష్టి - అనావృష్టిలతో జిల్లా రైతాంగం కోలుకోలేని విధంగా దెబ్బతినింది. జిల్లా ఆర్థిక వ్యవస్థ నిలువునా కుప్పకూలి పోయింది. మెట్ట ప్రాంతాలలో పంటలు రైతుల చేతికి అంది నాలుగేళ్లయ్యింది. ప్రతి ఏడాది అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నా, వానకో, కరువుకో, వరదకో రైతులు బలి పశువులయ్యారు. ఈ నాలుగేళ్లలో జిల్లాలో కనీసం రెండువేల కోట్ల రూపాయల పంట నష్టాలను రైతాంగం భరించాల్సి వచ్చింది. ఏడాది కాలంలోనే జిల్లా రైతాంగాన్ని మూడు దఫాలుగా ప్రకృతి ఉపద్రవాలు అతలాకుతలం చేశాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు వర్షాలు లేక రైతాంగం కమిలి పోయింది. అక్టోబర్ రెండో వారంలో వచ్చిన భారీ వర్షాలు, వరదలకు జిల్లా తల్లడిల్లి పోయింది. 750 చెరువులు తెగిపోయాయి. వేలాది ఎకరాలలో వరి పైరు నాశనం అయిపోయింది. నిమ్మతోటలు దెబ్బతిన్నాయి. జిల్లాలోని రోడ్లన్నీ కంకరగుట్టలుగా, మట్టిదిబ్బలుగా తయారయ్యాయి. కేవలం

కొరవ 8వ పేజీలో

గొలగమూడిలో గోల్మాల్?

వెంకయ్యా! నీకు దిక్కెవరు??

కంచే చేను మేసిన చందాన గొలగమూడి వెంకయ్యస్వామి గుడిలో అన్నీ వ్యవహారాల పర్యవేక్షణకు జిల్లా కోర్టు నియమించిన రిసీవర్లే దేవుని సొమ్ము స్వాహా చేశారన్న విషయం చర్చనీయాంశమయ్యింది. ఆశ్రమంలో జరిగిన అవకతవకలు, స్వాహాను స్వయంగా చూసిన జిల్లా జడ్జి చంద్ర కుమార్, ముగ్గురు రిసీవర్లను అక్కడి కక్కడే సస్పెండ్ చేశారు. తాత్కాలికంగా ఆలయ వ్యవహారాలు చూడమని ఇద్దరు సీనియర్ న్యాయవాదులను నియమించారు. వెంకయ్యస్వామి ఆలయ పెత్తనంపై భక్తుల్లో ఇరు వర్గాలు కోర్టు కెక్కడంతో నాలుగేళ్ల క్రితం అప్పటి జిల్లా జడ్జి న్యాయవాదులు కె.రాజగోపాల్ రెడ్డి, అనంత సత్యనారాయణ, పి.నాగేశ్వరరావులను రిసీవర్లుగా నియమిస్తూ, ఆలయ మంచి చెడ్డలు చూడమన్నారు. ఈ మధ్య వెంకయ్య స్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం జాస్తి కావడం వల్ల అన్ని రకాల కానుకలు, ఆదాయాలు ఎక్కువై పోయాయి. ఒక అజ్ఞాత భక్తుడు తన పేరు తెలియ జేయకుండా ఖర్చు చేయమని ఇచ్చిన పదిహేను లక్షలను సైతం రిసీవర్లు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు వచ్చాయి. భక్తుల నుంచి పలు ఆరోపణలు వస్తుండడంతో జిల్లా జడ్జి చంద్రకుమార్, అదనపు జిల్లా జడ్జి కృష్ణమోహన్ రెడ్డితో కలసి ఆదివారం వెంకయ్యస్వామి ఆశ్రమంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. జిల్లా జడ్జికి ఆశ్రమ కార్యాలయంలోని సిబ్బంది రికార్డులు చూపలేక పోయారు. ప్రసాదాల కౌంటర్ వద్ద అవకతవకలను జిల్లా జడ్జి కళ్లబడ్డాయి. దీంతో కోపం తారాస్థాయికి చేరిన జడ్జి 'దేవుడి సొత్తు తింటే పురుగులు పట్టి పోతారని' స్వయంగా వ్యాఖ్యానించారు. నిత్యావసర వస్తువులు భద్రపర్చే గదిని సైతం జిల్లా జడ్జి ఈ సందర్భంగా సీజ్ చేశారు. ఆలయంలో

కొరవ 8వ పేజీలో

అద్దాలతో పనిలేని కంటిచూపు - లాసిక్ లేజర్

ప్రొద్దున్నే నిదురలేచి తడుము కోకుండా మీ పడకగది కిటికీ నుండి ఉదయించే సూర్యుడిని చూడగలగడం ఎంత మధురమైన అనుభూతి?

కంట్లో నలుసులాంటి ప్లాస్టిక్ అద్దాలు (కాంటాక్టు లెన్స్) గురించి బెంగ లేకుండా మీ స్విమ్మింగ్ పూల్‌లోకి దూకగలగడం ఎంత హాయి? పెళ్లిచూపుల్లో అద్దాలతో కూర్చోవడం ఎంత ఇబ్బందికరం?

మన కంటి చూపు మామూలుగా వుంటే ఎంత బాగుండేది అని ఎన్నిసార్లు అనుకున్నాం? కళ్ళ అద్దాల అసౌకర్యానికి ఎన్నిసార్లు విసుక్కున్నాం? కంటి డాక్టర్లు, పేషెంట్లు కూడా ఈ కళ్ళద్దాల అసౌకర్యానికి చక్కని ప్రత్యామ్నాయం వుంటే ఎంత బాగుండేదని ప్రయత్నిస్తూనే వున్నారు. సుదీర్ఘ ప్రయత్నానికి పరాకాష్టగా క్లాసిక్ విజన్ అందిస్తున్న చక్కటి ప్రత్యామ్నాయమే ఈ **లాసిక్ లేజర్.**

కస్టం లాసిక్

కస్టం లాసిక్‌తో కంటి అద్దాలు, కాంటాక్ట్ లెన్స్‌లు అవసరంలేని కంటిచూపు అద్భుతంగా తిరిగి మన సొంతం అవుతుంది. రంగురంగుల సుందర దృశ్యాలు మునుపు చూసినంత చక్కగా చూడగలుగుతాం. మన జీవిత ప్రమాణాలు మెరుగుపరిచే ఈ ప్రక్రియ మనకు కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుంది.

క్లాసిక్ విజన్ మీ దృష్టికి సంబంధించిన కష్టాలను తొలగించి మీ జీవితానికి కొత్త వెలుగునిస్తుంది.

కస్టం లాసిక్ ఇప్పుడు ఉపయోగంలోనున్న "లాసిక్" ప్రక్రియ కన్నా ఎంతో మెరుగైనది.

కస్టం లాసిక్ మనకెన్నో ప్రయోజనాలను అందిస్తుంది. కంప్యూటర్ ద్వారా నియంత్రించబడ్డ సమాచారంతో కార్నియల్ టోపోగ్రాఫర్ మరియు వేవ్ ఫ్రంట్ అబెర్రో మీటర్ అందించే సమాచారం మేరకు కార్నియాను సరిచేసి ప్రకృతి సిద్ధమైన కంటిచూపును మనకందిస్తుంది. ఇప్పుడు ఉపయోగిస్తున్న ప్రిస్క్రిప్షన్ అద్దాల వల్ల కలిగే అసౌకర్యం పూర్తిగా నివారిస్తుంది. ఇంకా చెప్పాలంటే ప్రతికన్ను చేతి వేలిముద్రలలాగా ప్రత్యేకంగా వుంటుంది. కస్టం లాసిక్ ప్రతి కన్నునూ కావలసిన రీతిలో బాగుచేసి ప్రకృతిసిద్ధమైన చూపును తిరిగి ప్రసాదిస్తుంది.

సూపర్ విజన్

కస్టం లాసిక్ హైపర్ గల దృష్టి లోపములను సైతం బాగు చేయవీలవుతుంది. హ్రస్వదృష్టి - 20 డయాప్టర్స్ వరకు దూరదృష్టి +8 డయాప్టర్స్ వరకు సిలిండ్రికల్ పవర్ ± 6 డయాప్టర్స్ వరకు బాగు చేయవచ్చు.

పనిచేసే విధానం

కంటి నొప్పి కలగకుండా వుండేందుకు కంట్లో కొన్నిచుక్కలు మందు వేసి, కంటి రెప్పలు మూసుకుపోకుండా "ఐలిడ్ హోల్డర్"ను అమరుస్తారు. తరువాత మైక్రోకెరటోమ్ అనే పరికరం అమర్చి దూరంగా వున్న కాంతిపుంజంపై దృష్టి నిలపమంటారు. లేజరు ద్వారా కార్నియాను సరిచేస్తారు. ఇదంతా మామూలుగా లిప్తకాలంలో జరిగి పోతుంది. ఈ ప్రక్రియ తరువాత ఏదైనా కొంత అసౌకర్యం వున్నా 12 నుంచి 24 గంటలలో పూర్తిగా మామూలు స్థితికి చేరుకుంటారు.

ఇది ఎలా పనిచేస్తుంది

హ్రస్వదృష్టిని సరిచేయడానికి లేసర్ ద్వారా కార్నియా మధ్య భాగమును చదును చేస్తారు. దూరదృష్టిని సరిచేయడానికి కార్నియా మందాన్ని పెంచుతారు. ఆస్టిగ్మాటిజాన్ని తొలగించడానికి కార్నియాను మరింత గోళాకారంగా వుండేటట్లు నియంత్రిస్తారు. దీన్ని లేజర్ ద్వారా సాధిస్తారు.


మీరు లాసిక్‌ప్రక్రియకు సిద్ధమా?

ఎవరు చెయించుకోవచ్చు

18 సం.ల పైబడి ఆరోగ్యవంతమైన కార్నియా కలిగి వున్న ఎవరైనా ఈ ప్రక్రియ ద్వారా ప్రయోజనం పొందవచ్చు. గడచిన 12 నెలల కాలంలో మీ పవర్‌లో మార్పు లేకుండా వుంటే చాలు. కొన్ని ప్రత్యేకమైన వ్యాధులతో వున్నవారు, గర్భిణీ స్త్రీలు ఈ ప్రక్రియకు అర్హులు కారు.

మీ కంటిచూపే మా ధ్యేయం

భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా ప్రవేశ పెట్టబడిన అత్యంత ఆధునికమైన, జర్మనీ నుంచి దిగుమతి చేసుకోబడ్డ యంత్రం ద్వారా ఈ లాసిక్ ప్రక్రియ నిర్వహించ



బడుతుంది. ఈ ప్రక్రియకు సహాయకారకంగా అత్యాధు నికమైన సౌకర్యాలను కలిగి ఈ ప్రక్రియను ప్రయోగించడంలో ఎంతో అనుభవం, నిపుణత్వం కలిగిన **డాక్టరు బి. శివప్రతాప్ రెడ్డి, M.S.,D.O., పి.యల్.రావు, M.S., F.P.S.M. (Madurai) శ్రీమతి హెచ్. భారతి, MBBS., D.O., FPMS., (USA) కె. జగదీష్‌కుమార్ రెడ్డి, M.S., F.A.C.S., (Germany)** సాయి మురళీ. యన్., **M.S.,D.O., FACS., (USA)** మీ చూపు మాంద్యాన్ని పోగొట్టి సునిశితమైన చూపును కలిగించెదరు. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 2 పట్టణాలలో మాత్రమే కలిగిన ఈ ప్రక్రియ నెల్లూరులోని మా సెంటర్ నందు అందించడం జరుగుతుంది. ఇది అరుదైన అవకాశం. మీరు వినియోగించు కోండి. మీ కంటిచూపును సరిచేసుకోండి.

CLASIK VISION
C-WELL LASIK LASER CENTRE
15-296, Brindavanam, Opp. Corporation Bank, Nellore.
Ph: 347722, 331961, 324868
e-mail : clasikvision@vsnl.com;
website : www.clasikvision.com
ADVT.

నెల్లూరు వుప్పెనకు విలవిల్లాడింది

వర్షం

జిల్లాలో 5తేది నుంచి 10తేది వరకు విస్తారంగా వర్షాలు పడ్డాయి. వెంకటాచలం మండలంలో అత్యధికంగా 330.2 మిల్లీ మీటర్ల వర్షం పడగా, సీతారాంపురంలో అత్యల్పంగా 35.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. జిల్లాలోని 46 మండలాల్లో పడిన వర్షపాత వివరాలు దిగువనిస్తున్నాం.

వెంకటాచలం	330.2 మి.మీ
దొరవారిసత్రం	308.6మి.మీ
కావలి	293.2మి.మీ
మనుబోలు	290.7మి.మీ
అల్లూరు	287.7మి.మీ
నాయుడుపేట	279.2మి.మీ
కోట	269.6మి.మీ
బోగోలు	263.2మి.మీ
పెళ్లకూరు	259.6మి.మీ
వాకాడు	254.6మి.మీ
చిట్టమూరు	252.8మి.మీ
జలదంకి	250.8మి.మీ
తోటపల్లిగూడూరు	250.8మి.మీ
తడ	239.8మి.మీ
ఓజిలి	228.6మి.మీ
ముత్తుకూరు	227.2మి.మీ
నెల్లూరు	225.4మి.మీ
చిల్లకూరు	223.6మి.మీ
ఇందుకూరుపేట	221.0మి.మీ
సూళ్లూరుపేట	216.2మి.మీ
వితవలూరు	190.4మి.మీ
గూడూరు	188.6మి.మీ
బుచ్చిరెడ్డిపాళెం	188.2మి.మీ
పొదలకూరు	183.0మి.మీ
సంగం	173.3మి.మీ
కోవూరు	169.2మి.మీ
కొడవలూరు	165.8మి.మీ
దగదర్తి	133.4మి.మీ
అనంతసాగరం	116.6మి.మీ
ఆత్మకూరు	113.0మి.మీ
మర్రిపాడు	112.0మి.మీ
ఉదయగిరి	110.4మి.మీ
సైదాపురం	109.8మి.మీ
వింజమూరు	107.8మి.మీ
కలిగిరి	102.1మి.మీ
రాపూరు	93.6మి.మీ
బాలాయపల్లి	91.4మి.మీ
చేజర్ల	88.2మి.మీ
దుత్తలూరు	78.2మి.మీ
డక్కిలి	65.8మి.మీ
అనుమసముద్రంపేట	63.6మి.మీ
కొండాపురం	62.2మి.మీ
వరికుంటపాడు	59.6మి.మీ
వెంకటగిరి	48.0మి.మీ
సీతారాంపురం	35.4మి.మీ

ఇంజనీరింగ్ వండర్లు అండర్ బ్రిడ్జిలు!

నెల్లూరులో వున్న మూడు అండర్ బ్రిడ్జిలు ఇంజనీరింగ్ వండర్లే. ఈ అండర్ బ్రిడ్జిలు టౌన్ ప్రజలకు ఆపద సమయాల్లో ఉపయోగపడేవి కాకపోగా, లేనిపోని ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయి. చిన్నపాటి వర్షానికి కూడా ఆత్మకూరు బస్టాండ్, రామలింగాపురం, మాగుంట లేఅవుట్‌ల వద్ద వుండే అండర్ బ్రిడ్జిలు నీటి మడుగుల్లా తయారవుతున్నాయి. కొత్తగా నిర్మాణంలో వున్న విజయమహల్ బాక్స్‌టైప్ బ్రిడ్జి కూడా మరో ఇంజనీరింగ్ వండర్‌గానే మిగిలిపోతోంది. బాక్స్‌టైప్ బ్రిడ్జిలో ఎండా, వానా కాలాలతో నిమిత్తం లేకుండా నిరంతరం నీరు నిల్వ వుంటుండడం వల్ల ఈ బ్రిడ్జి ప్రజలకు వుపయోగపడే అవకాశం లేదు. మార్కులు రాని విద్యార్థులు ఇంజనీర్లయితే ప్రతి పని ప్రగతి ఈ అండర్ బ్రిడ్జిల మాదిరే తయారవుతుంది.

పారిశుద్ధ్యం బాగోలేదన్న కొత్త కమిషనర్

నెల్లూరు టౌన్‌లో పారిశుద్ధ్య పరిస్థితి ఛండాలంగా తయారైవున్నట్లు తన తొలి పరిశీలనలో తేలిందని కొత్త మునిసిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సోమిరెడ్డి చెప్పారు. పట్టణమంతా పర్యటించి పరిస్థితులు అవగాహన చేసుకొని పారిశుద్ధ్య పరిస్థితులు మొరుగుపరుస్తానన్నారు. మగబిడ్డను కంటానంటే వద్దనే అత్త ఎవరుంటారు కమిషనర్ గారు.

రంగనాయకులపేట రోడ్డు రగడ

రంగనాయకులపేట రోడ్డు నిర్మాణంలో నెలకొన్న వివాదం చిలికి, చిలికి గాలివానగా మారుతోంది. రోడ్డు నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని కోరుతూ రంగనాయకులపేట పిఎంఆర్ హైస్కూల్ వద్ద జరిగిన జన్మభూమి సభను ప్రజలు, కాంగ్రెస్, సిపిఎం, బిజెపి కొన్నిలర్లు 10తేది అడ్డుకున్నారు. జన్మభూమి నిర్వహణకు వచ్చిన ఆర్డీఓ, ఎమ్మార్వో, ఇతర వోడల్ అధికారులను పాఠశాలలోకి ప్రవేశించకుండా ఆపేశారు. వైస్‌ఛైర్మన్ సందానీబాషా, కొన్సిలర్లు నాగేశ్వరరావు, అరుణ, చాన్‌బాషా, పుట్టా రామకృష్ణారెడ్డి జన్మభూమి గ్రామసభను అడ్డుకొంటూ పాఠశాల గేటు వద్ద బైఠాయించారు.

పట్టణంలో ఓ ద్వీపం

నెల్లూరుటౌన్‌లో ఎప్పుడు భారీ వర్షాలు పడినా మన్సూర్‌నగర్ ఒక ద్వీపంలా తయారవుతోంది. మన్సూర్ నగర్‌కు రెండువైపులా వున్న పంట కాలువలు పొంగి ఈ ప్రాంతాన్ని జలమయం చేస్తున్నాయి. ఈ ప్రాంతంలోని నివాసులందరూ పేద ప్రజలే కావడంతో వర్షాలు వచ్చినప్పుడల్లా వారి బ్రతుకు దినదిన గండంలా తయారవుతోంది.

దేవళ్ల దశయ్యకు స్వర్ణ కంకణం

జిల్లా గ్రామ పరిపాలనాధికారుల సంఘం సర్వ సభ్య సమావేశం ఆదివారం టౌన్‌హాల్‌లో జరిగింది. కొత్త కలిక్టర్ అనంతరాము, జాయింట్ కలిక్టర్ ఎస్.ఎస్.రావత్‌ను ఈ సభలో ఏఓటలు ఘనంగా సన్మానించారు. ఈ సభలో గ్రామ పరిపాలనాధికారుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు దేవళ్ల దశరథరామిరెడ్డికి జిల్లా కలిక్టర్ అనంతరాము స్వర్ణ కంకణం తొడిగారు. గ్రామ పరిపాలనాధికారుల సంఘం అభ్యున్నతికి దశయ్య చేసిన కృషికి ఇది చిన్న సత్కారమేనవారి.

నెల్లూరులో టాటా ఫోన్లు

ప్రైవేటురంగంలో మొలక ఒలి ఫోన్ సర్వీసు ప్రొవైడర్ అయిన టాటా ఒలి సర్వీసెస్ లిమిటెడ్ నెల్లూరులో తన ఒలిఫోన్ సర్వీసులను 5తేది ప్రారంభించింది. ఇప్పటి వరకు టాటా ఫోన్లు హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, ఏలూరు, రాజమండ్రి పట్టణాలకు మాత్రమే పరిమితమై వున్నాయి. నెల్లూరులో 3500 ఫోన్ కనెక్షన్లు తక్షణం ఇచ్చే సామర్థ్యం తమకుందని, డిమాండ్‌ను బట్టి ఎన్ని కనెక్షన్స్ అయినా ఇస్తామని టాటా ఒలి సర్వీసెస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అజయ్‌పాండే చెప్పారు. దరఖాస్తు చేసిన ఐదవరోజే ఫోన్ కనెక్షన్ ఇస్తామని, వినియోగదారులకు ఏ సమయంలోనైనా అందుబాటులో వుంటామని చెప్పారు.

రంగడికి విశేష పూలంగిసేవ

తల్పగిరి రంగనాథ స్వామి దేవ

కొరవ 7వ పేజీలో



క్రొత్తదనానికి, పచ్చదనానికి ప్రతీక అయిన సంక్రాంతి పర్వదినం ప్రజల జీవితాల్లో సిరిసంపదలు, సుఖశాంతుల వెలుగుదివ్వెలను వెలిగించాలని కోరుకుంటూ కావలి నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు సమర్పించుకుంటున్నాను.

... వంటేరు వేణుగోపాలరెడ్డి, M.Tech.,

ఎమ్మెల్యే, కావలి

సంక్రాంతి శుభాకాంక్షలు

నెల్లూరుముచ్చట్లు

6వ పేజీ తొరవ

స్థానంలో 13తేది తండాళమ్మ, మూల వరులకు విశేష పూలంగిసేవ జరుగు తుంది. ఈ సందర్భంగా గోదాదేవికి ధనుర్మాసవ్రత భోగికళ్యాణ మహోత్సవం చేస్తున్నట్లు పూలంగి కమిటీ కన్వీనర్ సూళెట్టి సుధాకర్ చెప్పారు.

రామకృష్ణ సేవా సమితి సాయం

నెల్లూరు కాసుభేలవారి అగ్రహారంలోని శ్రీరామకృష్ణ సేవా సమితి, శారదాదేవి జన్మోత్సవాన్ని పురస్కరించుకొని 9తేది పొదలకూరు రోడ్డులోని ప్రభుత్వ వికలాంగ బాలికా శరణాలయంలోని బాలికలకు షోలాపూరు దుప్పట్లు పంచిపెట్టారు. సంస్థ నేతృత్వంలో 5తేది మూలపేటలోని ధర్మరాజస్వామి దేవస్థానంలో 650 మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ వి.విజయకుమార్‌రెడ్డి, సంస్థ కార్యదర్శి ఎస్వీ నరసింహారావు, సహాయ కార్యదర్శి టి.ఎల్.నారాయణరావు, బి.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు పొగతోటలోని రవి చిన్న పిల్లల ఆస్పత్రి 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 20తేది చిన్న పిల్లలకు ఉచిత అస్థమా, ఊపిరితిత్తుల వ్యాధుల వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. శిబిరాన్ని సమాచార మంత్రి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభిస్తారు. చెన్నైకి చెందిన పీడియాట్రిక్ పల్మనాలజిస్ట్ డాక్టర్ విజయశేఖర్ తోపాటు నెల్లూరులో ఊపిరితిత్తుల వ్యాధులు చూసే డాక్టర్లు ఎ.వి.సుధాకర్‌రావు, పి.మల్లిఖార్జునరావు, ఎన్.ఎన్.రాజు కూడా ఈ శిబిరంలో పాల్గొంటారని నిర్వాహకుడు డాక్టర్ రవికుమార్ చెప్పారు.

డిఎఫ్‌ఐడి లాంచింగ్ వర్క్ షాప్ 15న!

నెల్లూరులో మురికివాడల అభివృద్ధికి బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చే డిఎఫ్‌ఐడి నిధులతో చేపట్టే పనులకు ప్రారంభోత్సవ వర్క్‌షాప్‌ను 15తేది నిర్వహించనున్నట్లు మునిసిపల్ ఛేర్మన్ అనూరాధ చెప్పారు. డిఎఫ్‌ఐడి నిధులను వుపయోగించి అన్ని విధాలుగా పట్టణాన్ని అభివృద్ధి చేయను అన్ని రాజకీయ పార్టీల కౌన్సిలర్లతో సమావేశాలు ఏర్పాటు చేస్తానన్నారు. ఈ నిధులైనా మునిసిపల్ పాలక వర్గం సక్రమంగా వినియోగిస్తే అదే పదివేలు.

తుఫాన్ ఫేం రామకృష్ణయ్య మరణం

సుప్రసిద్ధ కవి, పండితుడు, నాటకకర్త, నటుడు, నాటక ప్రయోక్త, తుఫాన్ ఫేం పులుగుండ్ల రామకృష్ణయ్య (93) 11తేది నెల్లూరులో మరణించారు. రామకృష్ణయ్య తుఫాన్, శకుంతల, తలవనితలంపు, గాంధీ విజయం వంటి నాటకాలు వ్రాశారు. తుఫాన్ నాటకం హిందీలోకి తర్జుమా కావడంతో పాటు



వెంకటేశ్వర యూనివర్శిటీ డిగ్రీ విద్యార్థులకు పాఠ్య గ్రంథంగా కూడా ప్రవేశపెట్టిందంటే దీని ప్రత్యేకతను అర్థం చేసుకోవచ్చు. నాటకాలు సంక్షిప్తం చేయడంలో రామకృష్ణయ్య అందవేసిన చేయి. ప్రఖ్యాత కర్నాటక సంగీత కళాకారులు మంగళంపల్లి బాలమురళీకృష్ణకు వియ్యంకుడైన రామకృష్ణయ్యకు ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు వున్నారు.

***

నెల్లూరులో చంద్రభవన్ హోటల్ యజమాని పరమేశ్వరన్ రాజు (50) 10తేది చెన్నైలో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఆయన మృతికి సంతాప సూచకంగా టౌన్‌లోని హోటళ్లు 11తేది మూసివేశారు.

అత్మీయులను కోల్పోయిన పై కుటుంబాల వారికి మాసానుభూతి.

పేనుకుపెత్తనం

2వ పేజీ కొరవ

ఎవరూ లేకపోవడంతో ఎస్ఐ వెంకటేశ్వర్లు మరీ బరితెగించి ప్రవర్తించాడు. కోర్టులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు అంటే గడ్డి పరక క్రింద తీశాడు అమాయకుడు. న్యాయవ్యవస్థ బలం ఏమిటో, దానిని చులకన చేస్తే ఎంతటి పరిహారం చెల్లించవల్సి వస్తుందో అతడికి మొదట అర్థం కాలేదు.

ఇప్పుడు అర్థమైనా చేయగల్గింది ఏదీ లేదు. అతడిపై కేసు నమోదు కావడమే కాదు, అరెస్ట్ వారెంట్ కూడా జారీ అయ్యింది. గొడవ మరీ ముదిరిపోవడంతో గుంటూరు డిఐజి వినయ రంజన్ రే రంగ ప్రవేశం చేసి, అసలు ఐడి పార్టీ విభాగాన్నే రద్దు చెసి పారేశారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం కార్యదర్శి విక్రమ శ్రీ. నివాసరావు ఒక ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి, కోర్టులో కేసు విచారణ మొదలైనందువల్ల, ఆందోళన విరమించమని న్యాయవాదులను కోరారు. అయితే ఎస్ఐ వెంకటేశ్వర్లు మాత్రం తన ప్రవర్తన తీరు ఏ మాత్రం మార్చుకోలేదు. తాను అసలు ఆ ఇద్దరినీ పోలీస్ క్లబ్‌లో నిర్బంధించనే లేదని; సూర్యప్రకాశరావు అనే న్యాయవాదికి తనపై వున్న వ్యక్తిగత కక్షతో ఈ వివాదం సృష్టించాడని ఒక కొత్త ఆరోపణ చేస్తూ పత్రికలకెక్కాడు.

ఎస్పీ శ్రీనివాసరెడ్డి గారు శిక్షణ ముగించుకుని రేపు 13తేది నెల్లూరుకు తిరిగి రాబోతున్నారు. ఆయన వస్తే కాని ఈ ఆందోళన సమసి పోయేటట్లు కన్పడడం లేదు. టౌన్లో రౌడీ పంచాయతీలు జరగకూడదనే ఉద్దేశ్యంతో పోలీసు ద్వారా ఫైనాన్స్ కంపెనీల వ్యవహారాలు పరిష్కరించ చూశారాయన. కాని వెంకటేశ్వర్లు వంటి వారికి ఆ బాధ్యత అప్పచెప్పడంతో అది పోలీసు రౌడీయిజంగా మారింది. ఇందులో తప్పు ఖచ్చితంగా పోలీసుదే. అందువల్ల పట్టుదలకు పోకుండా తన ఎస్ఐని మందలించి, తగిన చర్య తీసుకుని, న్యాయవాదుల ఆందోళనను సమసింప చేయడం ఎస్పీ గారి బాధ్యత.

పాపిరెడ్డి

2వ పేజీ కొరవ

అవకాశం వుండేది కాదు. అందువల్లనే జిల్లా రాజకీయాలలో ఆయన అజాత శత్రువుగా మెలగగలిగారు. అన్ని పార్టీల నేతలు ఆయనకు సన్నిహితులే. అరమరికలు వుండేవి కావు.

పాపిరెడ్డి గారి రాజకీయాల వల్ల ఆయన కుటుంబానికి కాని, ఆయనకు ఓట్లు వేసిన ప్రజలకు కాని, ఆయన సభ్యత్వం నెరపిన చట్ట సభలకు కాని, ఆయన పుట్టి పెరిగిన బుచ్చిరెడ్డిపాళెం గ్రామానికి కాని వీసమెత్తు వుపయోగం జరగలేదన్న అభిప్రాయం నిజమే అయినప్పటికీ, ఆయన పంచి వారి అవసరం కూడా రాజకీయాలకు వుండడం వాస్తవం. తన చేతికి అంది వచ్చిన పదవులకు న్యాయం చేయక పోయినా దుర్వినియోగం మాత్రం చేయలేదు.

పాపిరెడ్డి గారికి ముగ్గురు సోదరులున్నారు - దశరథరామరెడ్డి, సీతారామరెడ్డి, ఓబులరెడ్డి; ఇద్దరుకుమారులు విదేశాలలో స్థిరపడ్డారు. పెద్ద కొడుకు సుధీర్‌రెడ్డి అమెరికాలో వైద్యుడు, చిన్న కుమారుడు రమేష్‌రెడ్డి అక్కడే ఇంజనీర్. కుమార్తె శోకళ ఆస్ట్రేలియా నివాసి. వారి కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి.

జమీన్‌రైతు

తెలుగు వార పత్రిక, వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పాగతోట సెంటర్, నెల్లూరు.

అభిమాన పత్రికతో అందుకోండి అద్భుతకానుక

జమీన్‌రైతు చందాదారులందరికీ నూతన సంవత్సర బహుమతి

జమీన్‌రైతు వారపత్రికకు ఇప్పటివరకు వున్న చందాదారులందరికీ, కొత్తగా చందాదారులుగా చేరే వారికి నూతన సంవత్సర కానుకగా ప్లాస్టిక్స్‌లో ప్రఖ్యాతిగాంచిన **అరిస్టో** కంపెనీవారి **సహేలీ జింబో** ట్రావెలింగ్ బాస్కెట్ రూ.120లు ఖరీదు చేసేది అందజేయబోతున్నాం.

2001 డిసెంబర్ 1 తేది నుంచి 2002 మార్చి 31 తేది లోపల చందాదారులుగా చేరే వారందరికీ ఈ కానుక అందుతుంది.

రూ.150ల చందాతో ఏడాదిపాటు జమీన్‌రైతు

రూ. 150/- =  + 

అదనంగా అంతే విలువకల్గిన అరిస్టో కంపెనీవారి సహేలీ జింబో ఉచితం

మీరు చేయవలసిందల్లా ...

- రూ.150లు చెల్లించి జమీన్‌రైతు చందాదారులుగా చేరండి.
- మీకు గాని, మీరు సూచించిన మీ స్నేహితులు, బంధువులకు కాని వారు దేశంలోని ఏ నగరంలో వున్నాసరే వారం వారం జమీన్‌రైతు సరఫరా జరుగుతుంది.
- అదనంగా రూ.120లు విలువ గల అరిస్టో కంపెనీవారి సహేలీ జింబో ట్రావెలింగ్ బాస్కెట్ కానుకగా అందజేయబడుతుంది! అంటే మీరుచెల్లించే చందామొత్తం మీకు తిరిగి వచ్చేస్తుందన్నమాట, పత్రిక ఉచితమని అర్థం!
- 1.12.2001 నుంచి 31.3.2002 మధ్య చందాదారులుగా చేరే కొత్తవారికి, రెన్యువల్ చేసుకొనే పాత చందాదారులకు కూడా కానుకలు అందజేయబడుతాయి.
- తమ బంధువులు, స్నేహితుల కోసం ఒకరు ఎన్ని చందాలైనా చెల్లించవచ్చు. వారందరికీ పత్రిక పంపుతాము. కానుకా అందజేస్తాం! ఇతర నగరాలు, రాష్ట్రాలలో వుండే వారికి పత్రిక పోస్ట్ ఖర్చులు కూడా మేమే భరిస్తాం!
- చందా చెల్లించిన వెంటనే రశీదుతో పాటు కానుక అడిగి తీసుకోండి, ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి. ద్వారా చందా పంపేవారు మా కార్యాలయానికి స్వయంగా వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు. చెక్కుల ద్వారా చందా చెల్లించేవారు బ్యాంకు కమీషన్ రూ.40లు అదనంగా చెల్లించాలి.

సాహసోపేత వాస్తవ వార్తాచిత్రిక
జమీన్‌రైతు పత్రిక

మరువలేను మా పాపిరెడ్డిని



అర్ధశతాబ్ది అనుబంధం మనది. ఆప్యాయం, అనురాగం, స్నేహం, హాస్యం కలగలిపిన నీ మాటలు ఇక నేను వినలేనంటే ఎంతో దుఃఖమేస్తున్నది. నీ ఆత్మకు శాంతి కలుగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి.

సూరి (పత్తి సూర్యనారాయణశెట్టి)
సాయి ఇంటర్నేషనల్ ట్రావెల్స్,
నెల్లూరు :: హైదరాబాద్

అపార్టుమెంట్లు - వాస్తుపరంగా నిర్మించవచ్చు!

* అపార్టుమెంట్లు వాస్తుపరంగా నిర్మిస్తున్నామని పత్రికా ప్రకటనలిస్తారు తీరా వాటిలో సామాన్య జనానికి తెలిసిన వాస్తు కూడా వుండదు. అపార్టుమెంట్లు వాస్తుపరంగా కట్టడం సాధ్యం కాదా?

పల్లంరెడ్డి సుప్రజ నెల్లూరు

చాలా మంచి ప్రశ్న. వాస్తుపరంగా నిర్మించడం చాలా సులభం. అయితే కొంచెం స్థలాన్ని కూడా క్యాష్ చేసుకోవాలనే ఆశ వాస్తు లేకుండా చేస్తోంది. ఈ మధ్య రాయచూరు, బీజాపూర్, గుంటూరు, విశాఖలలో అపార్టమెంటు ప్లానులిచ్చాను. వండ్రెడ్ పర్సెంట్ వాస్తు వుందని బిల్డర్స్ వప్పుకున్నారు.

* వైనీవ్ బాల్సం, ఎండో వైన్స్, పిరమిడ్స్ వల్ల ప్రయోజనం వుందా? వెర్రిగా కొంటున్నారు వీటిని! మీ అభిప్రాయం ఎమిటి?

వై.వి.రమణారెడ్డి కావలి

మంత్ర, తంత్ర లిఖిత బీజాక్షరాలు

వాస్తుసంగతులు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి

లేని ఏ వస్తువులైనా వేస్టు. పిరమిడ్ ఓపెన్‌టు స్కై' అయినప్పుడు ప్రయోజనం వుంటుంది. ఇంట్లో గాజు పిరమిడ్‌ల వల్ల ప్రయోజనం శూన్యం. జనం వెర్రిగా కొంటున్నా రన్నారు. అడవి మొక్కల్ని కుండీల్లో పెట్టి వందల రూపాయలకు అమ్ముతుండగా కాస్ట్లీ ఫీపుల్స్ కొనడం లేదా? వెర్రి వేయందాలు. ఎవడి పిచ్చి వాడి కానందం.

* మాయింటికి ఉత్తరాన రెండు, తూర్పున ఒకటి చెంకాయ చెట్లు వున్నాయి. అట్లా వుండవచ్చా?

ఎం.మాలకొండయ్య తురిమెర్ల

తూర్పు, ఉత్తరాల్లో భగవంతుడి పూజకు ఉపయుక్తమైన ఫలం, పుష్పం, పత్రం అందించే మొక్కలు వుండవచ్చు. అయితే పూర్తి ఈశాన్యంలో ఇవి అభ్యంతరకరం. స్థలాన్ని నాలుగు భాగాలు చేస్తే ఈశాన్యం ఒక భాగం పూర్తి ఈశాన్యం. అయితే పూర్తి ఈశాన్యంలోనైనా ఆ మొక్క ఫలాలు అయిపోయి 'కాపు' ఆగిపోయిన తర్వాత ఆ మొక్కను తీసివేయడం ఉత్తమం.

* వ్యాపారంలో బాగా నష్టపోయాను. కొందరు వాస్తు లేదు, గీస్తు లేదు అంటున్నారు. నాకైతే అనుమానంగా వుంది?

పామూరు అబ్బులయ్య వింజమూరు

ఎవరి కష్టనష్టాలకైనా వాస్తు ప్రథమం, తలరాతలు ద్వితీయం. అందుపల్ల 'వాస్తు' చూపించుకోండి.

* ఒక్కొక్క వాస్తు సిద్ధాంతి ఒక్కో విధంగా చెబుతారు ఇది ఎందువల్ల? మా యిల్లు నాలుగు సార్లు మార్పుకు గురి అయ్యింది.

క్రిష్ణమశెట్టి గూడూరు

ఈ ఆరోపణలు నేనూ విన్నాను. నిర్దుష్టమైన వాస్తు పరిజ్ఞానం లేకపోవడం వల్ల ఇట్లా జరుగుతుంది. మంచి వైద్యుణ్ణి సెలెక్టు చేసుకున్నట్లు మంచి వాస్తు శాస్త్రజ్ఞుణ్ణి మీరు ఎంపిక చేసుకోవాలి తప్పదు!

* పదేళ్ల నుంచి చేపల చెరువు చూస్తున్నాను. ఆర్థిక పరిస్థితి ఏమీ మారలేదు. తూర్పు, ఉత్తరాల మధ్య ఫీడ్ గోడౌన్ వుంది. అట్లా వుండవచ్చా?

గోపినేని గోవర్ధనరెడ్డి తడ

మీ సుదీర్ఘమైన ఉత్తరాన్ని చదివాను. ఫీడ్ గోడౌన్‌ను వెంటనే తొలగించండి. పశ్చిమ, దక్షిణ భాగాల్లో నిర్మించుకోండి. పశ్చిమంలోని ట్రాన్స్‌ఫార్మర్ మీ కష్టాలకు కారణం కానేకాదు. ఈశాన్యంలో కుండల దిష్టి బొమ్మను వెంటనే తీసివేయండి.

* ఎందరు వాస్తు శాస్త్రజ్ఞులకు చూపించినా, నా పరిస్థితి మారలేదు. ఇచ్చిన అప్పులు రావడం లేదు. వాస్తు పరిస్థితి అర్థం కావడం లేదు?

తిరుమూరు శ్రీనివాసులు సంతపేట

మీ పన్నెండు కార్డులు చేరాయి. ఉత్తరాల్లో కూడా మీకు స్థిమితత్వం కనిపించడం లేదు? ఇన్ని బాధలు పడుతూ ఒక్కసారి వాస్తు శాస్త్రజ్ఞుడిని కలవడానికి తీరిక లేక పోవడం విచిత్రం. ఉత్తరాలతోనే సిద్ధాంతుల్ని రప్పించానన్నారు. ఉత్తరాలతో అన్ని సమస్యలూ పరిష్కారం కావు.

* నేను చీరల వ్యాపారం చేస్తాను. ఒక్కో చీర మీద 25 నుంచి 300 వరకూ మిగులుతుంది. ఇల్లుకట్టినప్పటి నుంచి పరిస్థితి తారుమారయ్యింది. వ్యాపారం దివాళా తీసింది? మీరు మాయింటిని ఉచితంగా చూస్తారా?

పర్వతనేని రమాదేవి కోవూరు

మీ పరిస్థితికి ఇంటి అవాస్తు కారణం కావచ్చు. వాస్తును చక్కదిద్దుకోగలిగితే మీ పరిస్థితులు చక్కబడుతాయి. ముందు మీరు అపాయింట్‌మెంట్ తీసుకోండి. నిజంగా మీ పరిస్థితి బాగా లేకపోతే వాస్తు ఉచితంగా చూస్తాను.

* మాది కొత్తయిల్లు. మీ కోసం మీ అడ్రస్‌కు పదిసార్లు వచ్చాను. మీరు దొరకడం లేదు?

మహ్మద్‌రఫీ ఎ.ఎస్.పేట

దయచేసి అపాయింట్‌మెంట్ తీసుకోకుండా మీరు రావడం వల్ల ప్రయోజనం వుండదు. ఫోను చేసి ఆ తర్వాత కలవండి.

* మామూలు ఇంటికీ అపార్టుమెంట్ ఇంటికీ ఉన్నతేడా ఏమిటి?

శయనంసుజాతరంగనాయకులపేట

మామూలు ఇంట్లో అన్ని గోడలూ మావే! అపార్టుమెంటులో ఏ గోడా మాది కాదు!

* ముస్లింలు వాస్తు పాటించాలా? పూర్వం యిట్లా పాటించారా? మసీదులకు వాస్తు వుందా?

పఠాన్ భాజారహమతుల్లా కస్మూర్

వాస్తుకు మతభేదం లేదు. గీత, ఖురాన్, బైబిల్‌లో కూడా వాస్తు ప్రస్తావనలున్నాయి. అందరు వాస్తు పాటించడం మంచిది. పూర్వం అందరూ వాస్తును ఖచ్చితంగా పాటించేవారు. ముస్లింలు ఇల్లు కట్టడానికి పూర్వం 'ఉలేమాలను' దర్శించుకొనే వారు. మసీదులు తూర్పు ముఖంగా నిర్మిస్తారు. పశ్చిమంలో 'దైవం కుడ్యాన్ని' నిర్మిస్తారు. 'గోడ' ఇంద్రస్థానమైన తూర్పును చూస్తూ వుంటుంది. ఢిల్లీ మసీదు వాస్తుపరంగా నిర్మించారు. ఏది వాస్తుపరంగా నిర్మితమవుతుందో అది 'ఆకర్షణస్థితి'లో వుంటుంది. అదేమోకు కొండ గుర్తు.

వేలుపెడితే

5వ పేజీ కొరవ

విఫలయత్నం చేశాడని ధ్వజమెత్తారు. ఆదాల, వంటేరులు కూడా తమ నియోజకవర్గాల్లో సోమిరెడ్డి తమకు వ్యతిరేకంగా గ్రూపు కట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని వివరించారు. ఇటువంటి పనులు చేస్తాడన్న ఉద్దేశ్యంతోనే, తామంతా కలసి కట్టుగా ఉన్నామని, ముఖ్యమంత్రికి కూడా పరిస్థితి వివరించి చెప్పామని అన్నారు. మా నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకోగల శక్తి మాకుంది. చంద్రమోహన్‌రెడ్డి అవసరం మాకు లేదన్నారు. ఉదయగిరి, గూడూరు ఎమ్మెల్యేలు విజయరామిరెడ్డి, దుర్గా ప్రసాద్, జిల్లా టిడిపి నేత ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి కూడా ఈ సభలో పాల్గొన్నారు. వేగూరు సభ కన్నా, చెన్నూరు సభలో చంద్రమోహన్‌రెడ్డిపై తిట్ల మోతాదు ఎక్కువగానే ఉంది. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాత్రం పంచ పాండవుల దూషణలపై కించిత్ కూడా స్పందించడం లేదు. కప్పను మింగిన పాములా నిబ్బరంగా వున్నాడు. అల్లూరు, కావలి, కోవూరు నియోజకవర్గాలలో ఎమ్మెల్యేల వ్యతిరేకు లెవరైనా దొరక్కపోతారా అని ఎదురు చూస్తున్నట్టుంది ఆయన ధోరణి.

వెంకయ్య

5వ పేజీ కొరవ

జరిగిన ప్రతి వ్యవహారంలోనూ రిసీవర్లు చేతి వాటం చూపించారట. తనను, తన ఆశ్రమ ఆస్తులను వెంకయ్య స్వామే రక్షించుకోవాల్సిన పరిస్థితి ప్రస్తుతముంది.

జిల్లావార్తలు

5వ పేజీ కొరవ

రెండు రోజుల వ్యవధిలోనే ఈ వరదల వల్ల జిల్లాకు వెయ్యి కోట్ల నష్టం జరిగింది. తెగిపోయిన 750 చెరువులకు గండ్లు పూడ్చక ముందే, మూడు రోజుల క్రితం వచ్చిన భారీ వర్షాలతో జిల్లా పరిస్థితి గోరుచుట్టుపై రోకటి పోటులా తయారైంది. ఇప్పుడు కురిసిన వర్షాల వల్ల జిల్లాలో ప్రధాన పంటలైన వరి, మినుము, వేరుశనగ, పసుపు, మినుము, పొగాకుతో పాటు పుచ్చకాయల సాగుకు



జిల్లా గ్రామపరిపాలనాధికారుల సర్వసభ్య సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల దశరథరామిరెడ్డికి స్వర్ణకంకణం తొడుగుతున్న కలక్టర్ అనంతరాము. ప్రక్కన సంఘనాయకులు రామ్మూర్తి, సి. దశరథరామిరెడ్డి, కొన్నా వెంకయ్య

కూడా అపార నష్టం వాటిల్లింది. మొత్తం మీద 250 కోట్ల రూపాయల మేర అన్ని రకాల పంటలకు నష్టం జరిగి వుండవచ్చు. ఈసారి భారీ వర్షాలు కావలి డివిజన్‌లోని కావలి, జలదంకి, కలిగిరి, కొండాపురం మండలాలను కకావికలం చేశాయి. ఈ మండలాల్లో వేసిన మినుము, పొగాకు, శనగ, ధనియాల పంట పూర్తిగా నాశనమయ్యింది. జిల్లా మొత్తం మీద ఇప్పటి వరకు అందిన అంచనాల ప్రకారం లక్ష ఎకరాల్లో వేసిన 45కోట్ల రూపాయల విలువ చేసే మినుము పంట నాశనమయ్యింది. 6700 హెక్టార్లలో పొగాకు పంట, 610 హెక్టార్లలో కందిపంట, 460 హెక్టార్లలో వేరుశనగ, 3200 హెక్టార్లలో వరి పంట బాగా దెబ్బతినింది. గూడూరు డివిజన్‌లోని పెళ్లకూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట మండలాల్లో కూడా వర్షానికి పంటలు బాగా దెబ్బతిన్నాయి. అల్లూరు మండలంలో వెల్లువ వేల ఎకరాల్లో వరిపైరును ముంచెత్తింది. గత ఏడాది ఆగష్టు నెల వరకు కరువు కాటకాలతో జిల్లా అల్లాడిపోయింది. సెప్టెంబర్, నవంబర్‌లలో అల్పపీడనాలు కొంప ముంచగా, జనవరి నెలలో మళ్లీ కురిసిన వర్షాలు జిల్లా రైతులను కోలుకోనీయకుండా దెబ్బ తీశాయి. ఆర్‌అండ్‌బి, పంచాయతీ, ఇరిగేషన్ శాఖలకు కూడా వర్షాల వల్ల అపార నష్టం జరిగింది. 30కిపైగా చెరువులకు గండ్లు పడ్డాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అన్ని శాఖలకు చెందిన రోడ్లు చిద్రమై పోయాయి. ప్రకృతి వైపరీత్యం వల్ల మొత్తం మీద జిల్లా రైతాంగం నష్టాల ఊబిలో కూరుకపోయింది. మళ్లీ పెట్టుబడులు పెట్టి సాగుచేసే పరిస్థితులు లేవు. రైతు తిరిగి వ్యవసాయం చేయాలంటే ప్రభుత్వం పెద్ద ఎత్తున సబ్సిడీపై విత్తనాలు, పురుగుల మందులు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతున్న రైతులను ఆదుకొనే శక్తి ప్రభుత్వానికి లేనందు వల్ల రైతులు పంటల భీమా పథకాన్ని ఆశ్రయించాలని కావలిలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఉచిత సలహా యిచ్చారు.

వర్షబాధితులను పరామర్శించిన మంత్రి

సమాచారమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి 9తేది నెల్లూరు రూరల్, ఓజిలి, నాయుడుపేట, దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లో పర్యటించి పర్వబాధితులను పరామర్శించారు. ఆమంచర్ల చెరువు సమీపంలో పొర్లుకట్టపై గ్రామస్తులు మట్టి వేసుకొంటుండడాన్ని చూసి మంత్రి వారిని అభినందించారు. ఆమంచర్లలో 600 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు గ్రామస్తులు మంత్రికి తెలిపారు. గిరిజన కాలనీ ఎత్తు పెంచడానికి పనికి ఆహార పథకంలో నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఓజిలి మండలం మరుగొండ వద్ద వాగు తెగిపోవడం వల్ల 400 ఎకరాల పంట మునిగిపోవడం, ఇటీవల మరమ్మత్తులు చేసిన ఆర్‌అండ్‌బి రోడ్డు దెబ్బతినడాన్ని మంత్రి పరిశీలించారు. అన్ని ప్రాంతాల పర్యటన అనంతరం సూళ్లూరుపేట అతిధి గృహంలో మంత్రి విలేఖరులతో మాట్లాడారు. జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో మినుము పంట పూర్తిగా దెబ్బతినడంతో 60కోట రూపాయల ఆదాయం రైతులు కోల్పోయారు. నాలుగేళ్లుగా జిల్లాను అతివృష్టి అనావృష్టి పట్టిపీడిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి రైతులను ఆదుకోవడానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. వర్షాల వల్ల పంచాయతీరాజ్, ఇరిగేషన్ చెరువులు, కాల్వలు మరోసారి తెగిపోయాయి. అక్టోబర్‌లో కురిసిన వర్షాలకు చెరువుకట్టలు తెగిపోవడంతో 10కోట్ల 50లక్షల రూపాయలు ఖర్చు పెట్టి రింగ్‌బండ్లు, మరమ్మత్తులు చేపట్టినప్పటికి మళ్లీ తెగిపోయాయన్నారు. స్వర్ణముఖి, కాళంగి, నెర్రికాల్వ, పాముల కాల్వ పొంగి ప్రవహించడంతో వేలాది ఎకరాల్లో పంట దెబ్బతినిందన్నారు. మంత్రి వెంట పర్యటనలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే పరసారత్నం, వేనాటి రామచంద్రారెడ్డి, నెల్లూరు, గూడూరు ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

తుమ్మగుంటలో మకరజ్యోతి ఉత్సవం

తుమ్మగుంటలోని అయ్యప్పగుడి దేవస్థానంలో మకరజ్యోతి ఉత్సవం 14తేది జరుగుతుంది. ఈ ఉత్సవానికి ఉభయదాతలు మాగుంట సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, విజయారెడ్డిలు. అదేరోజు సాయంత్రం దీపారాధన, జ్యోతి దర్శన కార్యక్రమం జరుగుతుంది. 15తేది భక్తులు ఇక్కడ ఇరుముడి కట్టుకొని శబరిమలైకు పయనమవుతారని నిర్వాహకులు చెప్పారు.

అందంలేకపోయినా ఆదరించారు

అనిత ఆనందం

సువ్వ - నేను చిత్రంలో హీరోయిన్ అనితను అందరూ ఆంధ్రా అమ్మాయే అనుకొంటారు. కాని అనితది ముంబాయి. సంప్రదాయ సింధీ కుటుంబంలో పుట్టి ఇంటర్ వరకు మాత్రమే చదివింది. మాతలింగ్ చేస్తుంతగా దూరదర్శన్ మెట్రో ఛానల్‌లో ప్రసారమైన 'కభీసాథీ... కభీ సహేలీ' సీరియల్‌తో దర్శకుడు తేజ దృష్టి ఆకర్షించి హైదరాబాద్ వచ్చింది. తెలుగు సినిమా పరిశ్రమ ఎలా వుందని అనితను అడిగితే తాను పెద్ద అందగత్తెను కాకపోయినా హీరోయిన్‌గా ఆంధ్రా ప్రజలు అభిమానించడం మరువలేనిది. తొలిసారి సినిమా కెమరా ముందు నిలబడినప్పుడు చాలా భయమేసింది. దీనికి తోడు నా జుట్టు నుదుటి మీద పడేలా కట్ చేశారు. మార్పులు ఇబ్బందిగా అనిపించినా ప్రేక్షకులు ఆదరించారు. ప్రస్తుతం తెలుగు, హిందీ, తమిళ చిత్రాల్లో నటిస్తున్నాను. అయినా తెలుగులోనే స్థిరపడాలనుకొంటున్నాను. లావుగా వుండే హీరోయిన్లను తెలుగువారు అంతగా ఇష్టపడరని చాలా మంది చెబుతున్నారు. అందువల్ల ఒళ్లు తగ్గించుకోను ప్రయత్నాలు ప్రారంభించినట్లు చెప్పింది.



గడ్డిపరకతో ముద్దుమురిపాల్లో మాధవన్, స్నేహా.

రోజా మళయాళ మేళం!

తెలుగు, తమిళంలో అవకాశాలు లేవు

ప్రస్తుతం తెలుగులో యువ హీరోయిన్ల తాకిడికి సీనియర్ హీరోయిన్లు తట్టుకోలేక పోతున్నారు. తమ మనుగడ కోసం పోరాడుతున్నారు. తెలుగులో అవకాశాలు లేక తమిళ పరిశ్రమకు రోజా వెళ్లినా అక్కడా పరిస్థితులు అనుకూలించలేదు. దీంతో రోజా సీనియర్ హీరోయిన్లను ఆదరించే మళయాళ పరిశ్రమ దరిచేరింది. అక్కడ జయరామ్ సరసన 'మళయాళ మామను వణక్కమ్' చిత్రంలో నటిస్తుంది. తమిళ, మళయాళ కుటుంబాలకు చెందిన కథలో ఆసక్తిదాయకంగా తయారయ్యే ఈ చిత్రంలో తమిళ హీరో 'ప్రభు' కూడా నటిస్తున్నాడు. ఈ చిత్ర దర్శకుడు రాజసేనన్‌కు ఇది 25వ చిత్రం కావడంలో ఆయనీ చిత్రాన్ని కసితో తీసి రోజా గుబాళింపులు మళ్లీ వ్యాపింప చేయాలని చూస్తున్నాడు.

మాధురీ కూతుర్ని కోడల్ని చేసుకొంటా

మాధురీ దీక్షిత్, షారూఖ్‌ఖాన్ చాలా సినిమాల్లో విజయవంతమైన ప్రేమ జంటగా నటించి ప్రేక్షకుల అభిమానం పొందిన సంగతి పాఠకులకు విదితమే. ప్రస్తుతం మాధురీ గర్భవతి. ఆమెకు ఆడపిల్ల పుట్టాలని తాను కోరుకొంటున్నట్లు షారూఖ్‌ఖాన్ చెప్పాడు. మాధురీకి అందమైన ఆడపిల్ల పుడుతుంది. ఆ అమ్మాయిని మా ఆర్యన్‌కు ఇచ్చి పెళ్లి చేసి కోడలిగా చేసుకొంటానంటున్నాడు. ఆర్యన్ పెద్దయ్యే నాటికి పరిస్థితులు ఎలావుంటాయో షారూఖ్ ఊహించకుండా ఇంత గట్టిగా ఎలా చెబుతున్నాడో? మాధురీ కుమార్తెపై అంత అభిమానం ఎందుకు పెంచుకొన్నాడో అర్థం కావడం లేదు.

రేఖ విచిత్రవ్యాఖ్య

హైదరాబాద్ సినిమా వార్తలు

హిందీనటి రేఖ వాఖ్యలు అప్పుడప్పుడు వివాదాస్పద మవుతుంటాయి. తాను చెప్పాలను కొన్న విషయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం వల్ల ఈ పరిస్థితులు ఉత్పన్నమవుతుంటాయి. ఈ మధ్య రేఖ మగాడు ఒకే అమ్మాయికి కట్టుబడి వుండలేడండి. ఇది ఎందుకని నన్నడగొద్దు. నేను శారీరకంగా ఇరవై ఎనిమిదేళ్ల అమ్మాయిగా వున్నప్పుడే మానసికంగా మాత్రం ఎనభై ఏళ్ల పయస్సున్న వారు చవిచూసే అనుభవాలను ఎదుర్కొన్నాను. నేను సగం అమ్మాయిని. సగం అబ్బాయిని. నాలో అమ్మాయిని ఓ మగాడిలా ప్రేమిస్తాడో అలానే ప్రేమిస్తానని అర్థంగాకుండా గుండరగోళంగా మాట్లాడింది.

తెలుగువారితోనే సినిమా తీస్తాం

దర్శకునిగా, నిర్మాతగా పలు ఫ్లాప్ చిత్రాలు తీసినా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో సినిమాలు తీస్తుండే తమ్మారెడ్డి భరద్వాజ, తన కొత్త చిత్రాన్ని కృష్ణవంశీ దర్శకత్వంలో తీయనున్నారు. ఈ చిత్రాన్ని తెలుగువారితో మాత్రమే తీస్తామని, నిర్మాత, దర్శకులు ప్రకటించడం చర్చనీయాంశమయ్యింది. ఈ విషయాన్నే భరద్వాజ వద్ద ప్రస్తావిస్తే, తెలుగు పరిశ్రమలో భాషా భేదం సృష్టించడానికి ఈ విధంగా చెప్పలేదు. తెలుగు సినిమాకు ఇటీవల కాలంలో భాషేతరులు రావడం వల్ల వారి ప్రభావం సినిమా మేకింగ్ మీద కనిపిస్తుంది. తెలుగు మాట్లాడడం, చదవడం రాని వారితో నటింపజేయడం కష్టమవుతుంది. వీరికి ఇంగ్లీషులో లేదా హిందీలో డైలాగ్స్‌ని మరొకరు వివరించాలి. దానిని వారు అర్థం చేసుకొని అభినయించాలి. దీనివల్ల కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడి, వారు సరిగ్గా అర్థం చేసుకోలేక పోతుండడం వల్ల దాని ఎఫెక్ట్ పెర్‌ఫార్మెన్స్ మీద కనిపిస్తుంది. దీంతో సినిమాకథకు తగిన న్యాయం జరగడం లేదు. దర్శకులు అభిస్తున్న పెర్‌ఫార్మెన్స్, ఆర్టిస్టుల నుండి రావడం లేదు. ముంబాయి

తొరవ 11వ పేజీలో

కళ్లలో ఏముంది? కళ్లలోనే వుంది??

ఆకాష్ నెల్లూరీయుడే!

అందరూ నన్ను సెక్సీగా వున్నావంటూ చెబుతుండేవారని శిల్పాశెట్టి చెప్పింది. మొదట్లో ఈ కామెంట్ కర్ణ ప్రేయంగా వుండినా ఇప్పుడు మొఖం మొత్తేసింది. అందరూ నా పొడుగు కాళ్లను చూసి సెక్సీనంటే ఎలా? కానీ వీటిని మించిన ఎన్నో సెక్స్ అప్పీల్ స్థలాలు తనశరీరంలో వున్నాయంది. ప్రేమ గూర్చి చెబుతూ, ప్రేమను ఆకతాయి తనంగా తీసుకొంటే గబ్బు పట్టిపోతాం. అందువల్ల ఎవర్ని ప్రేమించినా సీరియస్‌గా ప్రేమిస్తాను. కానీ ప్రేమిస్తున్నదెవర్నో మాత్రం అడగ వద్దంది గడుసుగా.

ఆకాష్ నెల్లూరీయుడే!

ఆనందం చిత్రంలో నటించి అందరినీ ఆకట్టుకొన్న యువహీరో ఆకాష్ నెల్లూరీయుడు. ఆకాష్ తండ్రి స్వస్థలం నెల్లూరు కాగా, తల్లిది చెన్నై. తండ్రి వుద్యోగ రీత్యా లండన్‌లో స్థిరపడడంతో ఆకాష్ అక్కడే ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ కోర్స్ చదివాడు. క్లాసికల్, వెస్టన్ డాన్స్, కుంగ్‌ఫూ నేర్చుకొన్న ఆకాష్ 1997లో లండన్‌లో ఇండియన్ అసోసియేషన్ వాళ్లు నిర్వహించిన పోటీల్లో బెస్ట్ డ్యాన్సర్‌గా ఎంపికయ్యాడు. సన్నిహితులంతా హీరోలో వున్నావు; సినిమాల్లో ట్రై చేయకూడదా అంటే దర్శకుడు మణిరత్నం వెబ్‌సైట్‌కు ఫోటోలు పంపించి, చెన్నైలో

శిల్పాశెట్టి విసురు

బాలచందర్‌ను కలసి రోజావేసన్ చిత్రంలో అసలు పేరు సతీష్‌ను మార్చుకొని ఆకాష్‌నైనట్లు పాత కథ చెప్పుకొచ్చాడు. ఆనందం చిత్రం నన్ను రాత్రికి రాత్రి నన్ను స్టార్‌నుచేసింది. ఆ సినిమా హిట్‌కాగానే 30 సినిమాల్లో నటించమని ఆఫర్లు వచ్చాయి. కాని ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా విభిన్న తరహా పాత్రలు చేయాలనుకొంటున్నాను. అందుకే కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకొంటూ బాలీవుడ్ నటుడు పారూఖ్‌ను ఈ విషయంలో ఆదర్శంగా తీసుకొన్నట్లు చెప్పాడు. విడుదల కాబోయేచిత్రాలు సీతా చెప్పాలని, ఆకాశం, అపురూపం కూడా తన స్థాయికి నిలబెట్టుతాయని ఆకాష్ 'ఆనందం'గా చెప్పాడు.

కొత్తరాశిని చూస్తారు

గడచిన ఏడు కెరీర్‌పరంగా సంతృప్తిలేదని హీరోయిన్ రాశి చెప్పింది. 2001లో ఎనిమిది తెలుగు సినిమాల్లో నటించాను. కాని 'మా ఆవిడ మిద్దెట్టు మీ ఆవిడ చాలా మంచిది' చిత్రంలో పాత్ర ఒక్కటే నటిగా వృత్తిపరమైన సంతృప్తినిచ్చింది. గడచిన యేడాది పెర్‌ఫార్మెన్స్‌కు అవకాశం వుండే పాత్రలు ఎక్కువగా చేస్తూ వచ్చాను. మోడ్రన్, గ్లామరస్‌గా వుండే పాత్రలతో పాటు భక్తిరస ప్రధాన చిత్రాల్లో ఈయేడు చేస్తున్న పాత్రలు నన్ను ప్రేక్షకుల దరి చేరుస్తాయి. వారి కళ్లకు కొత్తరాశి కనపడుతుందని నమ్మకంగా చెప్పింది.

హనుమాన్ జంక్షన్‌లో "ఆహ్లాదం"

ఎం.ఎల్.ఆర్ట్స్ పతాకంపై ఎడిటర్ మోహన్ సమర్పణలో ఎం.వి.లక్ష్మి, 'హనుమాన్ జంక్షన్' చిత్రం నిర్మించింది. ఈ చిత్రానికి మోహన్ కుమారుడు ఎం.రాజా మొదటిసారిగా దర్శకత్వం వహించాడు. ఒక మళయాళ సినిమా కథ ఈ చిత్రానికి ఆధారం.

సినీఎడిటర్ మోహన్ సినిమాల నిర్మాణం పట్ల ఉత్తమ అభిరుచులు గలవాడు. ఇంత వరకు అతను కొన్ని విజయవంతమైన చిత్రాలు ప్రేక్షకులకు అందించాడు. కొత్త యువ హీరోలతో వరుసగా చిత్రాలు నిర్మాణమవుతున్న ఈ యువతరం ట్రెండులో పాత సీనియర్ హీరోలు జగపతిబాబు, అర్జున్‌లతో 'హనుమాన్ జంక్షన్' చిత్రం రూపొందించటం నిజంగా మోహన్ చేసిన సాహసమే!

దర్శకుడు ఎం.రాజా దర్శకత్వంలో చెన్నై ఫిల్మ్ ఇన్‌స్యూట్‌లో డిప్లమో పొందాడు. అక్కడి తర్ఫీదుతో చిత్రాన్ని చక్కగా తీర్చాడు. మళయాళం కథను తెలుగు వాతావరణంలోకి నాణ్యంగా మలిచాడు. ఈ కథలో జగపతిబాబు, అర్జున్, వేణు, స్నేహ, లయ, విజయలక్ష్మి ప్రధాన పాత్రలు పోషించారు. దర్శకుడు ఈ ముఖ్య పాత్రలను బాగా ఎదిగించాడు. ముగ్గురు

చిత్రసమీక్ష

గ్రిద్దలూరు గోపాలరావు

హీరోల నడుమ నడిచే స్నేహ బంధాన్ని ప్రత్యేక పద్ధతిలో చూపాడు. వారి స్నేహితాన్ని, వారి మనస్తత్వాలకు, వారి మధ్య ఏర్పడే సమస్యలకు, సన్నివేశాలకు అనుగుణంగా అనూహ్యమైన మలుపులు తిప్పారు. బలహీనులను బలవంతులు తొక్కివేసే దురాగతాన్ని ఎదిరించే విప్లవతత్వం ఆ హీరోల్లో రంగరించాడు. పొట్టచేత బట్టుకొని పల్లె నుంచి

హనుమాన్ జంక్షన్‌కు చేరుకున్న హీరోల చేత అక్కడ చెలరేగుతున్న రౌడీయిజాన్ని అంతమొందిపజేసిన తీరు బాగుంది. రౌడీలను అణచి దాదాలుగా చెలామణి అవుతున్న హీరోల దారి మార్చేందుకు, వారిని సరైన బాటలో నడిపించేందుకు హీరోయిన్లను ప్రవేశపెట్టి వారి ప్రమేయంతో కార్యం సాధించటం సమంజసంగా వుంది. కథ ఆకట్టుకునే విధంగా పరుగు తియ్యటానికి దర్శకుడు వ్రాసిన స్క్రీన్‌ప్లే పూర్తిగా సహకరించింది. ఎనిమిది అడుగుల ఎత్తున నిర్మించిన హనుమంతుడి విగ్రహం ఆకర్షణీయంగా వుంది. విగ్రహం వున్న ప్రాంతానికి హనుమాన్ జంక్షన్‌గా పేరు పెట్టారు.

తోటపల్లి మధు వ్రాసిన మాటలు పాత్రల తీరుతెన్నులకు తగ్గట్టుగా వున్నాయి. వేటూరి, చంద్రబోస్ పాటలు వ్రాశారు. పాప్ గాయకుడుగా వెలుగులోకి వచ్చిన సురేష్ పీటర్ ఈ చిత్రానికి

తొరవ 11వ పేజీలో

వారఫలాలు

12.12.2001తేది నుంచి 18.1.2002తేది వరకు వృషభంలో శని; మిథునంలో గురు, రాహువులు; ధనుస్సులో కేతువు, మరియు 14తేది వరకు రవి, భూములు; మకరంలో రవి, శుక్ర, బుధులు; కుంభంలో కుజుడు; ధనుర్మకర, కుంభ, మీనాలలో చంద్రుడు.



మేషం

(అశ్వని, భరణి, కృత్తిక 1పాదం)

వృత్తి, వ్యాపార రంగాలలో లాభాలు బాగుంటాయి. వ్యవసాయ పరంగా ఇబ్బందులు, నష్టాలుంటాయి. కుటుంబంలో కొంత అసంతృప్తి ఉంటుంది. అనుకున్న పనులు సత్వరంగా సాధించుకొంటారు. బంధు మిత్రులతో గడుపుతారు. ఉద్యోగస్తులకు అధికారుల సానుకూలత ఉంటుంది. రుణాలు ఆశించే వారికి అనుకూలత ఉంటుంది. ముఖ్య బాధ్యతనొకదానిని వహించక తప్పదు. విద్యాప్రగతి బాగుంటుంది. వాణిజ్య విస్తరణకు, పెట్టుబడి రంగాలలో ప్రయత్నాలకు అవకాశాలుంటాయి.



వృషభం

(కృత్తిక 2,3,4పాదాలు, రోహిణి, మృగశిర 1,2పాదాలు)

ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా వుండదు. ఆదాయం తగ్గుతుంది. ఖర్చులు అదనంగా ఉంటాయి. బంధుమిత్రులతో గడుపుతారు. జరగవలసిన పనులు, చేస్తున్న పనులు సవ్యంగా జరుగుతాయి. అధికార వర్గాల నుండి, ప్రభుత్వం నుండి సహకారం బాగుంటుంది. బాధ్యతల నిర్వహణలో గుర్తింపు ఉంటుంది. గౌరవ మర్యాదలకు లోపం రాదు. మిత్రులు మీకు సహాయపడతారు.



మిథునం

(మృగశిర 3,4పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు)

వృత్తి, వ్యాపార, వ్యవసాయ రంగాలలో ఆర్థికస్థితి దిగజారుతుంది. ఖర్చులు బాగా పెరుగుతాయి. ధనవస్తు నష్టం జరగవచ్చును. బంధువర్గంలో అనారోగ్య బాధితుల విషయాలు తెలుస్తాయి. అవసరాలు ఏదో విధంగా గడచిపోతాయి. ఉద్యోగ నిర్వహణలో జాగ్రత్త అవసరం. అధికారుల వత్తిడి, అధికారుల వల్ల ఇబ్బందులుండవచ్చును.



కర్కాటకం

(పునర్వసు 4పాదం, పుష్య, ఆశ్లేషలు)

బంధు మిత్రులను కలసుకొంటారు. ప్రయాణాలు తప్పవు. ఆర్థిక పరిస్థితి అన్ని రంగాల వారికి కొద్ది మెరుగ్గా వుంటుంది. రుణాల బాధ కొద్దిగా తీరుతుంది. ఆరోగ్య విషయంలో మీరు జాగ్రత్త పడాలి. ప్రయత్న లోపం జరగదు గాని పనులు సంతృప్తిగా నెరవేరవు. ఉద్యోగులపై పని వత్తిడి పెరుగుతుంది.



సింహం

(మఖ, పుబ్బ, ఉత్తర 1వపాదం)

వృత్తి, వ్యాణిజ్య, పారిశ్రామిక వర్గాల వారికి ఆర్థికంగా పట్టు బిగుస్తుంది. అవసరాలకు రుణాలు తప్పవు. ఉద్యోగ వర్గాలకు బాగున్నా బాధ్యతలు అదనంగా పెరిగి మోయక తప్పదు. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొనండి. కుటుంబంలోగాని, బంధువర్గంలోగాని ఆరోగ్యం సరిగా ఉండదు. రాజకీయ వర్గాలకు ప్రతిఘటన లుంటాయి. వారాంతంలో మంచి వార్త వింటారు.



కన్య

(ఉత్తర 2,3,4పాదాలు, హస్త, చిత్త 1,2పాదాలు)

ఆర్థికస్థితి కొంత ఒడుదుడుకులుగా వుంటుంది. ఆశించిన రాబడి వుండదు. రుణ సమస్యలు నిలబడి ఉంటాయి. కాని ఆదాయం పెంచుకొనే ప్రయత్నాలు అందుతాయి. అనుకున్న పనులు అనుకున్నట్టు జరగవు. కొద్ది మార్పులుంటాయి. ఉద్యోగులకు అధికార వర్గ సహకారం బాగుంటుంది. కుటుంబ సభ్యులతో విభేదాలు కలుగవచ్చును. కేసులు, వ్యవహారాలు పెండింగ్‌లో వుంచండి. రాజకీయ, సాంస్కృతిక రంగాల వారికి బాగుంటుంది. ప్రయాణాలు, బంధువర్గంతో గడపడం, వస్తు వస్తాది విలువైన వాటిని పొందడం జరుగుతుంది.

పంచాంగం

శుక్ల మాఘ్యమి ఫిబ్రవరి 20తేది వరకున్నది.

పండుగలు

తేది 13 ఆదివారం భోగి పండుగ. తేది 14 సోమవారం సంక్రాంతి పండుగ. ఉత్తరాయణ ప్రారంభం. అపరాహ్ణకాలం నుండి పితృకర్మలు నిర్వహించవచ్చు. తేది 15 మంగళవారం కనుమ పండగ.

జనవరి తిథులు

మార్గశీర్ష బహుళ

తేది12శని చతుర్దశి సా 5.42గం.వ
తేది13ఆది అమావాస్య సా 6.05గం.వ

పుష్య శుద్ధ

తేది14సోమ పాడ్యమి రా 7.05గం.వ
తేది15మంగళ విదియ రా8.40గం.వ
తేది16బుధ తదియ రా10.22గం.వ
తేది17గురు చతుర్థి రా12.28గం.వ
తేది18శుక్ర పంచమి రా2.40గం.వ

స్వయంపాకుల శ్రీనివాసులు, ఎం.ఏ.



తుల

(చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3పాదాలు)

ఆర్థికస్థితి బాగుంటుంది. వృత్తి, వ్యాపార, పారిశ్రామిక రంగాలలో ఆదాయం పెరుగుతుంది. ఆర్థిక విస్తరణకు అవకాశాలు లభిస్తాయి. పలుకుబడితో పనులు సాధించుకుంటారు. విలువైన వస్తువులు కొంటారు.



వృశ్చికం

(విశాఖ 4పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

కుటుంబంలో కొద్ది పాటి సమస్యలు తలెత్తగలవు. స్థిరాస్తుల వ్యవహారాలు కొంత చికాకు కలిగించవచ్చును. శుభకార్య ప్రయత్నాలు వెనుకబడవచ్చును. అనుకోని ఖర్చులు పైనబడగలవు. పనులకు ఆటంకాలు కలుగుతాయి. బంధుమిత్రులతో విభేదాలు రాకుండా జాగ్రత్తపడాలి. స్థిరాస్తుల లావాదేవీలకు ఆటంకాలు రావచ్చును. రాజకీయ, సాంస్కృతిక వర్గాలకు మంచి ప్రోద్బలం ఉంటుంది. విద్యార్థులు బాగా కష్టపడాలి.



ధనుస్సు

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పాదం)

ఆర్థిక ఇబ్బందులుంటాయి. కాని పెద్దగా బాధ ఉండదు. అనుకోని అదనపు ఖర్చులుంటాయి. నూతన వస్తు, వస్త్రాభరణాలు కొనే అవకాశాలున్నాయి. ఆస్తి లావాదేవీలు సక్రమంగా జరగవు. సోదరుల సహకారం లభిస్తుంది. విద్యాప్రగతి బాగుంటుంది. షేర్లు, పెట్టుబడులలో పెద్దగా ఆదాయం ఉండక పోవచ్చును. కుటుంబంలో కొద్దిపాటి కలతలు ఏర్పడవచ్చును. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. అధికారుల సహకారం బాగుంటుంది. దూర ప్రయాణాలు, బంధుమిత్రులను కలుసుకొనడం జరుగుతుంది.



మకరం

(ఉత్తరాషాఢ 2.3.4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1,2పాదాలు)

ఆర్థిక పరిస్థితి మందకొడిగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు కొంత చికాకు కలిగిస్తాయి. అనుకున్న పనులు సాఫీగా జరుగక మానసిక బాధ ఉంటుంది. బంధువర్గంలో అనారోగ్య పీడితులు ఉంటారు. వ్యవహారాలు, వ్యాపార రంగాలలో అవకాశాలు తప్పిపోవచ్చును. ఉద్యోగులు ఎక్కువ పనిభార పీడితులు కాగలరు. అధికారులను ప్రసన్నం చేసుకొంటే మంచిది. ఇతరుల పనులు నిర్వహించవలసి వస్తుంది. విద్యార్థులు బాగా కష్టపడాలి. రాజకీయ వర్గాలకు ఒడిదుడుకులుంటాయి.



కుంభం

(ధనిష్ఠ 3,4పాదాలు, శతభిష, పూర్వాభాద్ర 1,2,3పాదాలు)

ఆర్థిక లావాదేవీలు కష్టం కాగలవు. వాణిజ్య వ్యవసాయ రంగాలలో కొద్దిపాటి నష్టాలు రావచ్చును. తొందరపాటు ప్రవర్తన వల్ల తగాదాలు రావచ్చును. స్థిరాస్తుల మీద ఆదాయం స్వల్పం. దూర ప్రయాణాలు, బంధువులను కలుసుకొనడం జరుగుతుంది. అధికారుల నుండి గట్టి వత్తిడి ఉద్యోగులకు తప్పదు.



మీనం

(పూర్వాభాద్ర 4పాదం, ఉత్తరాభాద్ర, రేవతి)

వృత్తి, వ్యాపార రంగాలలో ఆదాయం, ఆర్థికస్థితి బాగుంటుంది. కాని ఖర్చులు కూడా పెరుగుతాయి. ఇతరుల విషయాలలో జోక్యం చేసుకొనవద్దు. అనుకున్న పనులు సవ్యంగాను, ఖర్చుతోను జరుగుతాయి. కుటుంబ సమస్యల వల్ల చికాకులుంటాయి. అనుకోని విధంగా స్వల్ప రుణం చేయవలసి రావచ్చును. సోదరులతో విభేదాలు కలుగవచ్చును. అధికారవర్గ ఉద్యోగులకు బాగుంటుంది. బంధుమిత్రులను కలుసుకుంటారు. రాజకీయ, సాంస్కృతిక వర్గాలకు ఆదాయం, ప్రోద్బలం బాగుంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది.

జనవాణి

3వ పేజీ కొరవ

చెప్పాలి.

నెల్లూరు *కె.అరుణకుమారి*

ఇదేం ఆదరణ?

రెండేళ్ల క్రితం ఆదరణ పథకం క్రింద పనిముట్లు ఇస్తామని జన్మభూమి సభల్లో ప్రజల వద్ద డబ్బులు డీపాజిట్లుగా కట్టించుకొన్నారు. కాని ఇంత వరకు ఒక్క పని ముట్టు కూడా ఇవ్వలేదు. బలహీన వర్గాల జన్మభూమి అని ప్రకటించుకొన్న ఈ జన్మభూమిలో కూడా పనిముట్లు ఇచ్చే విషయంలో ప్రభుత్వం విఫలమైన దృష్ట్యా ప్రజల వద్ద కట్టించుకొన్న డిపాజిట్లైనా తిరిగి ఇచ్చేయడం ధర్మం.

నెల్లూరు *వున్నం బసవయ్య*

గ్యాసు ఎప్పుడిస్తారు?

నెల్లూరు టౌన్ 15వ వార్డు పరిధిలోగల పాదుపులక్ష్మి గ్రూపు మహిళలు 90మందికి రెండేళ్ల క్రితం గ్యాస్ కనెక్షన్లు ఇస్తామని ఎంపికచేశారు. వీరికి కల్పన గ్యాసం ఏజన్సీ కూపన్లు కూడా ఇచ్చారు. కాని ఇంత వరకు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వలేదు. ప్రతి జన్మభూమి సభలకు వెళ్లి అర్జీలిచ్చి రావడం తప్ప ఇప్పటి వరకు ప్రయోజనం చేకూరలేదు. రెండేళ్ల క్రితం ఎంపిక చేసిన వారికి గ్యాస్ కనెక్షన్లు ఇవ్వనివారు కొత్తగా ఎంపిక చేసిన వారికి ఎప్పుడిస్తారు?

నెల్లూరు *పి.రమణమ్మ*

పోలీసులు-న్యాయవాదుల రగడ

న్యాయవాదులు, పోలీసుల మధ్య వివాదం ముదిరి పాకానపడింది. ఎస్పీ ఐడిపార్టి ఎస్‌ఐ వెంకటేశ్వర్లును సస్పెండ్ చేయాలని న్యాయవాదులు రెండు వారాలుగా కోర్టులు బహిష్కరించడంతో పాటు రిలే నిరాహార దీక్షలు కూడా చేస్తున్నారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు చాలా సివిల్ పంచాయతీలు చేశారు. దీని వల్ల ప్రజలకు లబ్ధిచేకూరింది వాస్తవమే. దీనికి ప్రోత్సాహకుడు ఎస్పీ శ్రీనివాసరెడ్డి. కాని ఎస్పీకి తెలియకుండా చాలా విషయాల్లో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు జోక్యం చేసుకొన్నారు. ఒక కేసు విషయంలో కోర్టు కమిషనర్‌తో పాటు, జడ్జీలను సైతం తిట్టాడని న్యాయవాదులు ఆరోపిస్తూ ఎస్‌ఐపై న్యాయవాదులు ఆందోళనకు దిగారు. పోలీస్ క్లబ్‌లో కోర్టు కమిషనర్‌కు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లుకు మధ్య జరిగిన సంభాషణ విషయమై ఈ వివాదం జరిగిన మొదటి రెండు, మూడు రోజుల్లోనే జిల్లా జడ్జి స్వయంగా విచారించి వుంటే వ్యవహారం శృతి మించేదికాదు. చిన్న విషయమై రేగిన ఈ వివాదాన్ని న్యాయవాదులు, పోలీసులు సాగదీయడం వల్ల కోర్టులో కక్షిదారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా వున్నాయి.

నెల్లూరు *ఎస్పీ సుందరం*

నక్సల్ దారి తప్పిపోయారు

గతవారం జమీన్‌రైతు సంపాదకీయంలో ప్రాసినట్లుగా నక్సలైట్ల పయనం ఎటువైపో అర్థం కావడం లేదు. ప్రజల పక్షాన పోరాటం మానేసి, చందాల వసూలుకే పరిమితమై పోయారు. అమాయకులను చంపడం, ఆ తర్వాత తాపీగా క్షమాపణలు చెబితే ప్రయోజనం లేదు. ప్రభుతం కూడా ఎన్‌కౌంటర్లు, లాకప్ డెత్‌లు చేస్తూ సారీలు చెప్పి చేతులు దులుపుకొంటే సరిపోతుందన్న బాటను వారే చూపినట్లుంది. ఇది అంతిమంగా ప్రజల ప్రజస్వామిక హక్కులు, మానవ హక్కులను కాలరాయడమే. మానవ హక్కులను గౌరవించడం నేర్చుకోలేని క్యాడర్లను నక్సల్స్ వుద్యమంలోకి తీసుకరావడం మహా తప్పు. మానవహక్కులను గౌరవించని సాయుధ ముఠాలను, దోపిడి ముఠాలనవచ్చు. నక్సలైట్లు ప్రస్తుతం ఏ బాటలో నడుస్తున్నారో స్పష్టం చేయాల్సిందే.

నెల్లూరు *కె.రామారావు*

గూడూరు స్టేషన్‌లో టిక్కెట్ కౌంటర్

దక్షిణ మధ్య రైల్వేలో గూడూరు జంక్షన్‌కు ఎంతో ప్రత్యేకత వుంది. ఎప్పుడూ రద్దీగా వుండే ఈ స్టేషన్‌లో సాధారణ ప్రయాణీకులు టిక్కెట్లు తీసుకోను ఒక్క కౌంటరే వుండడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. రైళ్లు వచ్చేస్తుంటే టిక్కెట్ల కోసం తమ వంతు వచ్చేవరకు ప్రయాణీకులు ఎదురు చూడాల్సి వస్తుంది. ప్రయాణీకుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గూడూరు రైల్వే స్టేషన్‌లో మరో టిక్కెట్ కౌంటర్ పెట్టాలి. ఈ విషయంలో నెల్లూరు ఎమ్పీ డాక్టర్ రాజేశ్వరమ్మ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

గూడూరు *ని. పొచ్.సురేష్‌బాబు*

50 ఏళ్లక్రితం

5వ పేజీ కొరవ

జిల్లాలో కాంగ్రెస్ ఇంతగా దెబ్బతినడానికి కారణం, కాంగ్రెస్ వాదుల లోని అనైక్యత, సేవాకాంక్ష నశించడం, ముఠాతత్వం, స్వార్థాభిలాష పెంపొందడం, ప్రజలతో సన్నిహిత్యం పెట్టుకోక పోవడం, అభ్యర్థుల నిర్ణయంలో లోపాలు, ఆలస్యంగా నిర్ణయించడం, రైతులు ముఖ్యంగా ధనికుల దేశ కాలపాత్రల నెరుగక అనైక్యంగా, అనాలోచితంగా అగమ్య గోచరంగా, అనర్థదాయకంగా వర్తించడం; శ్రామికవర్గం ముఖ్యంగా హరిజనులు కమ్యూనిస్టు పార్టీ మోసపు ప్రచారాలకు లోనుగావడం; వయోజన ఓటింగు విలువను ఓటర్లు గమనించలేకపోవడం, అన్నింటి మించి ఆహార విషయంలో జిల్లాకు అత్యంత క్లిష్టకాలమైన ఈ సమయంలో ఎన్నికలు సంభవించడం, అధికార్లు ప్రభుత్వంతో సహకరించకపోగా వ్యతిరేకంగా పని చేయడం; ప్రజల పట్ల అధికార్లు తమ బాధ్యతలను విస్మరించడం - ఇవీ కాంగ్రెస్ దెబ్బతినడానికి ముఖ్య కారణాలుగా మనం భావించవచ్చు.

నా ఓటమికి కారణాలు
గోపాలరెడ్డి వివరణ

5తేది మద్రాసులో శ్రీగోపాలరెడ్డి గారిని పత్రికా విలేఖరులు కలసుకొని ఓటమికి కారణాలడుగగా, స్వంత నియోజకవర్గంలో నెగ్గక పోతామా అనే మితిమీరిన విశ్వాసముతో తాను వహించిన అశ్రద్ధ, విజయం సాధించాలనే పూనికతో తన ప్రత్యర్థి గావించిన ప్రబల ప్రచారం, ముగ్గురు మధ్య పోటి రావడం, అందులో సోషలిస్టు అభ్యర్థి తనకు వచ్చే ఓట్లను చీల్చుకోవడం, తాను ఆ నియోజకవర్గములో ఎనిమిది రోజులు మాత్రమే వుండడం, కాంగ్రెస్ అభ్యర్థిగా తనపై జరిగిన విష ప్రచారం, ఆహార దుస్థితి, ఇతర చిక్కులు కాంగ్రెస్ ప్రభుత్వం తోపాటుగా చిత్రించడం, స్థానిక పరిస్థితులని చెప్పారు.

* * *

చిద్రమే

4వ పేజీ కొరవ

రోడ్లపైనే నిలచిపోతుంది. ముత్తుకూరు బస్టాండ్ వద్ద అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నాలుగు చినుకులు రాలితే నిండిపోతుంది. దీనివల్ల ముత్తుకూరు వైపు వెళ్లే వాహన చోదకులు, ప్రయాణికులు పడరానిపాట్లు పడుతున్నారు. పట్టణంలో ప్రధాన వీధులైన ఆచారివీధి, కాపువీధి, చిన్నబజారు, పెద్దబజారు, దంతువారివీధి, యర్లవారివీధి, జిండా వీధి, గర్నివీధి, పొగతోట, కస్తూరిదేవి నగర్, స్టోన్‌హౌస్‌పేట మెయిన్‌రోడ్డు, సంతపేట సెంటర్, రంగనాయకుల పేటల్లో అన్నీ వీధులు వర్షమొస్తే డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. పద్ధతిపాడు లేకుండా వేసిన సిమెంటు రోడ్లు, కట్టిన కాల్వలు ఈ దుస్థితికి కారణమవుతున్నాయి. పొగతోటలో మూడు హాళ్ల సెంటర్ వద్దకు వన్‌టౌన్ ప్రాంతంలోని నీళ్లన్నీ వచ్చి పడతం, ఇవి వెళ్లే వీలు లేకుండా పోవడంతో కళ్యాణి ఫిలింస్, విఆర్‌కాలేజి, చిల్డ్రన్స్ అకాడమీ వరకు వర్షం పడినప్పుడల్లా చిన్నవాగులా ఈ ప్రాంతం కనపడుతుంది. రైల్వే శాఖ కట్టిన ప్రహరీగోడ వల్లే ఇక్కడ ఈ దుస్థితి దాపురించింది. అత్మకూరు బస్టాండ్ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి వద్ద నాలుగు చినుకులు పడినప్పుడు అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంటుంది. వర్షమొచ్చినప్పుడు టౌన్‌లో శివారు ప్రాంతాల ప్రజల పరిస్థితి దారుణంగా వుంటుంది. పట్టణంలో భూగర్భ డ్రైనేజి పథకం ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం చేత ఆమోదింపజేసి హడ్కో నిధులు విడుదల చేయించి, సక్రమంగా ఈ పని చేపడితే టౌన్‌లో వర్షానికి మురికి ముదనష్టపు సెలయేళ్లు పారడం కాస్తయినా తగ్గుతుంది. మునిసిపాలిటీ వేస్తున్న సిమెంటు రోడ్లను సైతం ఒక ప్రణాళిక ప్రకారం వేస్తే నీళ్లు వీటిపై నిలబడవు. ప్లాను పద్ధతిలేని అడ్డగోలు కట్టడాలు కూడా పట్టణంలో నీరు నిలబడి పోవడానికి కారణభూతమవుతున్నాయి. పట్టణంలో నుంచి వెళ్లే పంట కాల్వల దురాక్రమణ కూడా రోడ్లపై నీరు పొంగి ప్రవహించేలా చేస్తున్నాయి. ఈ పంట కాల్వల్లో చెత్త తొలగింపుకు విడుదల చేసిన 20లక్షలు దుర్వినియోగమయ్యాయే తప్ప, పని అంతంత మాత్రంగానే జరిగిన సంగతి అందరికీ తెలిసిందే. చిత్తశుద్ధిలేని విధానాలు మూలంగా వర్షమొస్తే పట్టణ ప్రజలు ఎక్కడికక్కడే నిలబడిపొయ్యేలా చేస్తున్నాయి.

ఎన్నార్ సినీవిలాస్‌లో వేడుక

నెల్లూరులోని వెంకటరమణా 70ఎంఎం థియేటర్‌ను తన స్వంతం చేసుకొని, పుష్కరకాలంగా విజయవంతంగా నడుపుతున్న సందర్భంగా డిశంబర్ 29తేది నెల్లూరు రాధాకృష్ణారెడ్డి చిన్న వేడుక జరిపారు. నెల్లూరువాడైనా ఎక్కడా తన ప్రశస్తి కొంచెం కూడా చూపించుకోని నిరాడంబర పరిశ్రమికుడు రాధాకృష్ణారెడ్డి. బాస్‌లోని సినిమా ఎగ్జిబిటర్లను అందరినీ పిలిచి ఎన్నార్ సినీవిలాస్‌లో తేనీరుతో విందు చేశారు. వెంకటరమణా థియేటర్‌తో ప్రస్థానం ప్రారంభించి నాలుగు హాళ్లుగా విస్తరించినా, ఆదాయం లేకుండా హాళ్లను నడుపుతూ, ఈ సందర్భంగా తనకు ఆదర్శమైన పెదనాయన స్వర్గీయ నెల్లూరు వెంకటరెడ్డిని జ్ఞాపకం చేసుకొని సంతృప్తి చెందారు. ఈ పుష్కర కాలం పూర్తి చేసుకొన్న సందర్భంగా వుద్యోగస్తులందరికీ బోనసులిచ్చి వారి సంతోషానికి కారకుడయ్యారు. ఈ సందర్భంగా వర్కర్లందరికీ ఒక డీసిల్ అంబాసిడర్ కారును బహుమతిగా ఇచ్చి దాన్ని టాక్సీగా నడుపుకొని వచ్చిన ఆదాయాన్ని పంచుకోమని సలహా యిచ్చారు. సినిమాహాళ్లు బాగా నడిపి యాజమాన్యానికి కృతజ్ఞతగా వుంటామని ఈ సందర్భంగా కార్మికులు ప్రతినబూనారు.

చిత్రసమీక్ష

9వ పేజీ కొరవ

సంగీతం అందించాడు. పాప్ సంగీతంలోనే గాక భారతీయ సంగీతం మీద కూడా అతనికి మంచి పట్టువుందని ఈ చిత్రానికి కూర్చిన సంగీతం చెబుతుంది. 'కోనసీమల్లో ఓ కోయిలా' అంటూ వినిపించే ప్రేమయుగళ గీతం ఆకట్టుకుంటుంది. రాంప్రసాద్ కెమరా హంగు అన్ని దృశ్యాలను బాగా పొంగించింది.

దాసు (జగపతిబాబు), కృష్ణ (అర్జున్) ప్రాణ స్నేహితులు. వారి స్నేహం ఎంత ప్రాణప్రదమైందీ అంటే దాసును పేరడిగితే నా పేరు కృష్ణ అంటాడు. కృష్ణను అడిగితే నా పేరు దాసు అంటాడు. ఒకరు కష్టాల్లో వుంటే మరొకరు చూడలేరు. కృష్ణకు ఒక ప్రియురాలు చేరువవుతుంది. దాసుకు ప్రియురాలు లేదని కృష్ణ తన ప్రియురాలిని వదలుకుంటాడు. ఇలా పరస్పరం పెచ్చుతగ్గులు లేకుండా ఒకరి సుఖం కోసం మరొకరు పాటుపడుతుంటారు. వీరికో చెల్లెలుంది. ఆమెను ఎంతో ప్రేమతో చూసుకొంటూ వుంటారు. ఆమెను వేణు ప్రేమిస్తాడు. దాంతో వేణు, కృష్ణ, దాసుల స్నేహితుడవుతాడు. లయ, స్నేహలు, దాసు, కృష్ణలకు ప్రియురాళ్లుగా చేరువవుతారు.

పల్లెవదలి బ్రతుకుదెరువు కోసం దాసు, కృష్ణ, హనుమాన్ జంక్షన్ చేరుకుంటారు. మంచివారుగా వున్న వీరు అక్కడ ప్రజలను ముంచే వారితో పోరాటం సాగిస్తారు. మంచిని పెంచే ప్రయత్నంలో తగిలే ఎదురు దెబ్బలను ఎదుర్కొంటూ విజయం సాధిస్తారు. ప్రేమ ఫలితాన్ని సుఖంగా అనుభవిస్తారు.

నటీనటులంతా సమర్థవంతంగా నటించారు. బ్రహ్మానందం, కోవై సరళ, ఎల్బీ శ్రీరాం, ఎమ్మెస్. నారాయణ, వేణు ఇతోధికంగా వినోదానికి సాయపడ్డారు.

సినిమా

9వ పేజీ కొరవ

నుంచి వచ్చేవారు తెలుగు పరిశ్రమను నిచ్చెనలా వుపయోగించుకొంటున్నారు. కొందరికి స్టేస్ ఔట్‌లా తెలుగు సినిమా మారింది. ముంబాయి అంటే మనకున్న గామర్, గ్లిట్‌పల్ల అక్కడ అప్పలమ్మలు కూడా ఇక్కడ హీరోయిన్లుగా వెలుగుతున్నారు. తెలుగువారి హీరోయిజానికి పెట్టిని పరిక్రమకు అందుబాటులో వుంటారు. దీనికి తరుణ్, ఎన్టీఆర్, ఉదయకిరణ్‌లే మంచి ఉదాహరణ. అందువల్లనే తెలుగువారితో సినిమా తీయాలని ధృఢంగా నిర్ణయించుకొన్నట్లు చెప్పారు.

నోట్లకోసం

4వ పేజీ కొరవ

నిర్వహణకు అరలక్ష పైనే ఖర్చు పెట్టాల్సి వస్తుంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో వుండేవి టౌన్‌హాల్, స్టోన్‌హౌస్‌పేటలోని కళ్యాణ మండపాలు. అంబేద్కర్ భవన్, కోటమిట్టలోని షాదీమంజిల్‌లో. టౌన్‌హాల్‌లో సభలు, సమావేశాలకు ఈ మధ్య రేట్లు పెంచగా కరెంట్ కాకుండా బాడుగ 800 రూపాయలు అవ్వగా, పెళ్లిళ్లకు మాత్రం నిలబెట్టి నాలుగు వేలు వసూలు చేస్తున్నారు. అన్నీ వర్గాల కోసం కట్టిన టౌన్‌హాల్‌ను ముస్లింలు పెళ్లిళ్లు చేసుకోను ఇవ్వక వివక్షత చూపుతున్నారు. ఈ హాళ్లలో హైరర్స్, అదనపు ఆకర్షణలు చేకూర్చను లైటింగుల పేరిట భారీగా గుంజేస్తున్నారు. పట్టణంలో సభలు - సమావేశాలు నిర్వహించుకొనే హాళ్లు, కళ్యాణ మండపాల రేట్లు బాగా పెరిగిపోవడం ఈ మధ్య సభలు - సమావేశాలు, చిన్న చిన్న ఫంక్షన్లు వీధుల్లోనే పామియానాలు వేసి కర్టన్లు అడ్డుగా పెట్టి జరిపేస్తున్నారు. ఆర్థిక స్థోమతలేని కళాకారుల ప్రదర్శనకు చోటు లేకుండా పోయింది. పెళ్లిళ్లు మాత్రం ప్రిస్టేజి కోసం అప్పో సొప్పో చేసి కళ్యాణ మండపాల్లో అతి కష్టం మీద జరిపించేస్తున్నారు.

చికెన్ ధర

4వ పేజీ కొరవ

గత మూడు నెలలుగా కోడిగ్రుడ్డు రేటు మాత్రం 1.25పైసల వద్ద స్థిరంగా వుంది.

మాయాజాలం

4వ పేజీ కొరవ

లతో కలుపుకొంటే ప్రతినిత్యం క్లబ్‌కు వచ్చే ఆదాయం 30వేలు. ఆదివారం పేకాట ఆడేవారు ఎక్కువ కాబట్టి కలెక్షన్ కూడా పెరుగుతుంది. ఈ లెక్కల ప్రకారం క్లబ్ ఆదాయం నెలకు 9లక్షలు. పేకల కొనుగోలు 90వేలు, పనిచేసే వారి జీతాలకు 25వేలు, విద్యుత్ బిల్లుకు 75వేలు, చిన్న చితకా ఖర్చు మరో 50వేలు కలుపుకొంటే నెలకు 2లక్షల 40వేలు ఖర్చు; సంవత్సరానికి సభ్యులకు గిఫ్ట్‌లు ఇచ్చేందుకు మరో 3లక్షలు ఖర్చు చేస్తారు. మిగతాదంతా మిగులే. ఏడాదికి ఈ మిగులు 60లక్షల పైమాటే. ఏడేళ్లుగా పాతుకపోయిన కమిటీ నిర్వహణలో ఐదు కోట్లకు పైగా మిగులు వుండాలి. కాని మిగులు నామమాత్రమే. రోడ్లు, వీరుగల కొంతమంది కమిటీ సభ్యులకు ఇప్పటి పాలకవర్గం నెలనెలా జీతాలు లంచంగా చెల్లిస్తూ ఈ వ్యవహారం బయటపడకుండా జాగ్రత్తపడుతుంది. క్లబ్ కార్యదర్శిగా పనిచేస్తున్న వ్యక్తికి ఈ క్లబ్ సొమ్ము ఆరగింపులో అగ్రస్థానం. మిగతా వారికి కూడా భాగమిస్తున్నాడు. పబ్లిక్‌గా ఇంత దోపిడీకి పాల్పడుతున్న క్లబ్ వ్యవహారాన్ని పునఃతాధికారులు పరిశీలించి సరిదిద్దాల్సి వుంది.

ప్రగతే ముద్దు

4వ పేజీ కొరవ

రెండవ రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి 27కోట్లు మంజూరయ్యాయన్నారు. మునిసిపల్ ఛైర్మన్ అనూరాధ, మాజీ మంత్రి రమేష్‌రెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ రేగా నారసింహారెడ్డి, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులురెడ్డి, ఆర్డీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డి.కె.లో ఎంఎస్‌సి కంప్యూటర్ కోర్సు!

విద్యార్థినులు తమ భవిష్యత్తుకు తగిన విధంగా విద్యారంగంలో వస్తున్న కొత్త కోర్సులు చదివి వున్నత స్థాయికి ఎదగాలని సమాచారమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. 7తేది నెల్లూరు డికె డబ్ల్యు కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో కంప్యూటర్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి 150 కాలేజీలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో డిగ్రీ కాలేజిల కంటే ఎక్కువగా ఇంజనీరింగ్ కాలేజీలు తెరచి రాష్ట్రంలో సాంకేతిక విద్యకు బాటలు వేశారన్నారు. డికె కాలేజితో నాకు ప్రగాఢ అనుబంధం వుంది. సర్వేపల్లి ఓట్లు ఇక్కడే లెక్క పెడతారు. ఇక్కడ ప్రకటించిన ఫలితాలతోనే నేను ఎమ్మెల్యే అయ్యాను; ఆ తర్వాత మంత్రి నయ్యానన్నారు. కాలేజిలో ఎంఎస్‌సిలో కంప్యూటర్ కోర్సు నెలకొల్పడానికి తన వంతు సహకారమందిస్తానన్నారు. నెల్లూరు ఎమ్మెల్యే వివేకానందరెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ కోర్సులతో పాటు సాంఘిక శాస్త్రానికి కూడా ప్రాముఖ్యత నివ్వాలన్నారు. ప్రిన్సిపల్ నరసింహులు మాట్లాడుతూ రెండువేల మంది విద్యార్థినులు ఇక్కడ చదువుతున్నారని, హాస్టల్స్‌లో 850 మంది వున్నారన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇచ్చిన 56లక్షల రూపాయల నిధులతో కొత్తగా కట్టిన హాస్టల్ భవనాల సముదాయం ఈ నెలాఖరుకల్లా పూర్తవుతుందన్నారు. ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజకుమారి, ఆర్‌అండ్‌బి ఎస్ఇ ఎన్. వెంకయ్య కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజల కోసం ప్రత్యేక పథకాలు

16వ విడత జన్మభూమి సందర్భంగా బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వారి అవసరాలకు తగ్గట్టు ప్రత్యేక పథకాలు రూపొందించి అమలు చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి జస్వంత్ హుస్సేన్ చెప్పారు. నెల్లూరు జిల్లాకు జన్మభూమి పర్యవేక్షక అధికారిగా విచ్చేసిన ఆయన విలేఖరులతో మాట్లాడారు. ప్రజల్లో సాంఘిక చైతన్యం ఎక్కువయ్యింది. జిల్లాలో జన్మభూమి సభలకు ప్రజాస్పందన బాగుంది. చాలా గ్రామాల్లో ప్రజలు పట్టాదారు పాసుపుస్తకాలు, పాఠశాలల్లోని సమస్యలు, రేషన్‌కార్డుల గూర్చి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులు అందుబాటులో వుండరన్న భావన వుండేది. ఇప్పుడా భావన మారిందన్నారు. జన్మభూమి సభలో ప్రతి అర్జీని పరిశీలించి, పరిష్కారాలు వెతుకుతారన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా 4,959 యూనిట్ల స్థాపనకు 6కోట్ల 93లక్షల రూపాయలు ఖర్చు పెట్టినట్లు చెప్పారు. షెడ్యూల్ కులస్తుల అభివృద్ధి కోసం భూమి కొనుగోలు పథకం, మైనర్ ఇరిగేషన్ క్రింద బోరుబావులు, నీళ్లబావులు, కరెంట్ మోటార్లు, విద్యుత్ కనెక్షన్లు ఇస్తామన్నారు. పండ్ల తోటల పెంపకం, భూమి అభివృద్ధి, స్వయం ఉపాధి కార్యక్రమాల్లో లబ్ధిదారులను జన్మభూమి గ్రామసభల ద్వారా ఎంపిక చేస్తామన్నారు.

జమీన్‌రైతు చందా

సంవత్సర చందా రూ.150

విదేశాలకు చందా రూ.800

In the court of the (MACT) District Judge, Nellore

E.P. No. 1/1999 O.P. No. 64/1991

(1) తోంగళ్ల అదిశేషయ్య, (2) తోంగళ్ల తాసెల్మమ్మ - దిక్రీహోల్డర్లు

Vs.

(1) ఎస్. లలిత - జడ్‌జిఆర్.

వేలం ప్రకటన

యిందుమూలముగా తెలియజేయడ మేమనగా క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పైన కనపరచిన E.P. బాకీ వసూలు నిమిత్తం 12.2.2002 తేది కోర్టులో ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలము వేయబడును. పాటలో పాల్గొనదలచినవారు పాల్గొన వచ్చును.

ఆస్తి షెడ్యూలు

నెల్లూరు జిల్లా రిజిస్ట్రేషన్, కోవూరు సబ్ రిజిస్ట్రేషన్, తొడవలూరు మండలం, తొడవలూరు గ్రామంలో వుండే మాగాణి భూమి పట్టా నం. 339, సర్వే నం. 40/3-ఎ2-00ట్ట, సర్వే నం.37 - 0.72, సర్వే నం. 36/4 - 0.55, సర్వే నం.36/3 - 0.28, సర్వే నం. 35 - 0.23, వెరసి ఎ. 3.78 ట్ట పై కనపరచిన ఎ. 3.78 ట్ట మాగాణి భూమికి హద్దులు తూర్పు: పిడుగ్ముడి ధాసిల్ దక్షిణం పారుదల కాలువ, పడమర సిద్ధారెడ్డి త్రిదేవమ్మ స్థలము, ఉత్తరం: సిద్ధారెడ్డి త్రిదేవమ్మ మాగాణి భూమి దిక్రీహోల్డరు విలువ: రూ.1,50,000/ అమీనా విలువ: రూ. 1,89,000/

పి. బలరామయ్య, దిక్రీహోల్డరు వకీలు



డా. సి. మల్లికార్జున్
MBBS., MDRC.,
షుగర్‌వ్యాధినిపుణులు

శ్రీసాయి డయాబిటిస్ సెంటర్

16/647, (సాయిబాబా మందిరం ప్రక్కన), గాంధీనగర్, ట్రంక్‌రోడ్డు, నెల్లూరు. ఫోన్ : 329572

ప్రముఖ డయాబిటిస్ లీసెర్చి సెంటర్, మద్రాసు నందు మొట్ట మొదటి సారిగా మూడు సంవత్సరాలు డయాబిటిస్ కోర్సు పూర్తిచేసి అత్యంత ఆధునిక పరికరములతో అన్నివేళలా అందుబాటులో వుండి అతిస్వల్పకాలంలోనే అందరి మన్ననలను పొందిన డా. సి. మల్లికార్జున్, గారికి

సంక్రాంతి శుభాకాంక్షలు...

సాయికేశవ మెడికల్

Padmavathi Ads, Ph: 339500

కాంగ్రెస్ నేతలు

మొదటి పేజీ తొరవ

వందల సంఖ్యలో పోటీ పడ్డారు. అందరినీ సముదాయించి, సర్దిచెప్పి, సానుకూలంగా టిక్కెట్లు ఇవ్వటం కష్టమైన విషయమన్నది నిజం. అయితే కొంచెం విజ్ఞత, మరికొంచెం పారదర్శకత పాటించి వుంటే; ఒక స్పష్టమైన విధానం నిర్ణయించుకుని, దానికి కట్టుబడి వుంటే పార్టీ పరువు నిల్చివుండేది. కాని పిసిసి అధ్యక్షుడు తన చేతకాని తనంతో, నిబద్ధత లేని చవకబారు పద్ధతులతో మొత్తం పార్టీని బ్రష్టు పట్టించాడు. పేరుకు ప్రతి ప్రాంతానికి పరిశీలకులను నియమించి, అభిప్రాయ సేకరణ జరిపారే తప్ప - టిక్కెట్ల నిర్ణయంలో పరిశీలకుల సిఫార్సులు పరిగణనలోకి రానేలేదు. జాబితా ప్రకటనకు మూడు రోజుల ముందు నుంచి పిసిసి నేత సత్యనారాయణరావు గాంధీ భవన్ నుంచి అదృశ్యమై పోయాడు. బంజారాహిల్స్‌లోని తాజ్ హోటల్ గదిలో, దొంగ వలె దాక్కుని, తనకు నచ్చిన ఫేర్లు వ్రాసి టిక్కెట్లు పంపిణీ చేశారాయన. కొందరు ఆంతరంగికుల మాట తప్ప, పార్టీ పరిశీలకుల అభిప్రాయాలు, స్థానిక నేతల మనోభావాలు, అభ్యర్థుల విజయావకాశాలు పరిగణనలోకి తీసుకోనేలేదు.

దీని ఫలితంగా గాంధీభవన్ దగ్గర అసహ్యకరమైన వాతావరణం ఏర్పడింది. టిక్కెట్ రాని వారందరూ గుంపులు గుంపులుగా వచ్చి నేతలను బూతులు తిట్టారు; అసభ్యకరమైన నినాదాలు చేశారు. కోదండరెడ్డి వంటి సీనియర్ నేత కూడా తన అనుచరులతో వచ్చి ఆఫీస్ ముందు దీక్ష చేపట్టి పరిస్థితి ఏర్పడింది. సిటి కాంగ్రెస్ అధ్యక్షుడి దుస్థితి కూడా ఇంచు మించు అంతే. ఆయన చెప్పిన వారిలో ఒక్కరికి కూడా టిక్కెట్ రాలేదు. పరువుకు ఏడ్చి అతనొక్కడు సర్దుక పోయాడు కాని, తతిమా వారంతా తమకు తోచిన రీతిలో ఆక్రోశం వెళ్ల క్రక్కడానికి సందేహించ లేదు. ఆ తిట్లు, శాపనార్థాలు, విధ్వంస పూరిత వాతావరణం చూస్తే కుక్క తోక వంకరైనా సర్దుకుంటుంది కాని, కాంగ్రెస్ నేతల బుద్ధి మాత్రం మారదు అన్పించింది.

మరీ దారుణమైన ఆరోపణ టిక్కెట్లు అమ్ముకున్నారన్నది. కొన్ని స్థానాలలో పిసిసి నిర్వాహకులకు డబ్బు సంచులు సమర్పించి టిక్కెట్ తీసుక వెళ్లారన్న ఆరోపణ సీనియర్ నగర నేతల నుంచే ఎన్పిస్తున్నది. ఇందులో నిజా

కరెంట్

మొదటి పేజీ తొరవ

అనుసరిస్తున్న కఠిన వైఖరి వల్ల ఇటు పల్లెలు అటు పట్టణాలలో దొంగతనం చాలా వరకు తగ్గిపోయింది. అక్రమ కనెక్షన్లు కొత్తగా పుట్టుక రావడం లేదు. ఏ నెల బిల్లు అదే నెలలో ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెద్దగా పెరగను కూడా లేదు. పారిశ్రామికాభివృద్ధి క్షీణించి పోవడం వల్ల ఆ రంగంలో వినియోగం తగ్గు ముఖం పట్టింది. వ్యవసాయ రంగంలో ఇది వరకటి వలె లేదు. కరెంటు సరఫరా అవకతవకల వల్ల పలువురు రైతులు మళ్లీ పాత కాలంనాటి ఆయిల్ ఇంజన్లను వెలికి తీస్తున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది కరెంట్ ఉత్పత్తి కూడా బాగా వుంది.

ఈ పరిస్థితులలో విద్యుత్ సంస్థకు నష్టాలు ఎందుకు వస్తున్నాయో మన ముఖ్యమంత్రికి తెలియాలి. ఛార్జీలు పెరిగే కొద్ది నష్టం పెరిగిపోవడం ఎక్కడ లెక్కో అర్థమే కావడం లేదు. విద్యుత్ సంస్థ ఇంత పెద్ద లోటు చూపించిన తర్వాత ఛార్జీలు పెంచక తప్పదు. అయితే ఇప్పుడు ఆ పెరిగే ధరలు భరించే స్థితిలో ప్రజలు వున్నారా అన్నదే సమస్య.

రానున్న రెండేళ్ల కాలంలో ఏ ఎన్నిక లేక పోవడంతో పాటు, కాంగ్రెస్ పార్టీ అంతర్గత కుమ్ములాటలతో నిర్వీర్యమై వుండడం వల్ల ఏ కఠిన నిర్ణయానికైనా మించిన దొరకని మంచి తరుణం ఇదేనని చంద్రబాబు భావన. రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదవ ఏమి వుంది. ధరల పెంపకం రేపు ఏప్రిల్ నెల నుంచి వుండబోతుంది. అప్పటి బాధాకర నిర్ణయానికి ఇప్పటి నుంచే రచ్చ అవసరం లేదు. అయితే చావు కబురు చల్లగా మాత్రమే చెప్పాలన్న సూత్రాన్ని మనసా వాచా నమ్మిన వాడాయన. ఒకేసారి ఈ వార్త విన్పిస్తే జనం అల్లాడి పోవడంతోపాటు కోపంతో



ఆమంచర్లలో తెగిన చెరువును పరిశీలిస్తున్న రాష్ట్ర సమాచారమంత్రి నారెడ్డి చంద్రమోహన్ రెడ్డి.


పూగి పోతారు; మూడు నాలుగు నెలలపాటు దాన్ని పదే పదే ప్రస్తావిస్తూ పోతే నిజంగా ధరలు పెంచే సమయానికి జనం దానికి అలవాటు పడి పెద్దగా బాధపడరు. అందువల్లనే ఇప్పటి నుంచి కొద్ది కొద్దిగా సమాచారం పత్రికలకు వదులుతూ ప్రజలను మానసికంగా సిద్ధం చేస్తున్నది ప్రభుత్వం.

జమీన్‌రైతు చందా

విడిప్రతి రూ.3.00
సంవత్సర చందా రూ.150
విదేశాలకు చందా రూ.800

టైగర్ రొయ్యపిల్లలు
నాణ్యమైన, టైగర్ రొయ్యపిల్లలు డెలివరీకి సిద్ధంగా వున్నవి.
కావలసినవారు సంప్రదించండి.
స్టాండర్డ్ హేచరీస్
మైపాడు :: నెల్లూరు జిల్లా. ఫోన్స్ : (O) 323060
Cell : 98490 - 48841; 98490 - 16385

అభినందన హార్దిక శుభాకాంక్షలు



శ్రీ నేదురుమల్లి జనార్దనరెడ్డి
పార్లమెంటు సభ్యులు మరియు
పార్లమెంటు ఫైనాన్స్ స్టాండింగ్ కమిటీ ఛేర్మన్



శ్రీమతి ఎన్. రాజ్యలక్ష్మి
వెంకటగిరి శాసనసభ్యురాలు



కీ.శే. శ్రీ రాజీవ్ గాంధీ



శ్రీమతి సోనియాగాంధీ
ఎ.ఐ.సి.సి. అధ్యక్షురాలు

సమర్థవంతమైన నేతగా జాతీయస్థాయిలో తనకంటూ ఒక ప్రత్యేకతను, గుర్తింపును పొంది, అనునిత్యం ప్రజాసేవలోనే గడుపుతూ, సింహపురికాళిని దశదిశలా వినిపిస్తున్న అపురూప రాజకీయనేత్త, ప్రజానాయకుడు, మా పథనిర్దేశకుడు, మాకు అత్యంత ఆప్తుడు, మాజీ మఖ్యమంత్రి, పార్లమెంటు సభ్యులు

శ్రీ నేదురుమల్లి జనార్దనరెడ్డి గారు

అత్యంత ప్రతిష్టాత్మకమైన పార్లమెంట్ ఫైనాన్స్ స్టాండింగ్ కమిటీ ఛేర్మన్‌గా పదవిని పొందిన శుభసందర్భముగా మా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, వారు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అలంకరించాలని అభిలషిస్తున్నాము.

తుంగా దయాకర్ రెడ్డి • తుంగా ఇందూధర్‌రెడ్డి
తుంగా గిరిధర్ రెడ్డి :: నెల్లూరు

Edited, Printed and Published by N. Dolendra Prasad at Zaminryot Press. Ph: 091-861-327354, Offset Printing at Zaminryot Press, Nellore.